APTEL/25/A0055

newsnedu.com

# న్యూస్ నేడు

ఆదివారం, సెప్టెంబర్ 6 2026

సంపుటి : 02 ● సంచిక : 158 ● పేజీలు : 8 ● వెల రూ.4/-

తెలుగు దిన పత్రిక

Simultaneously Published from Kurnool ANDHRA PRADESH & TELANGANA, VIJAYAWADA, SRI POTTI SRIRAMULU NELLORE, KRISHNA, CHITTOOR

## పండుగ వాతావరణంలో గురుపూజోత్సవం

- 175 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులకు అవార్డుల ప్రదానం
- గురువులను ఘనంగా సత్కరించిన సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



విజయవాడ, న్యూస్ నేడు : భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విజయవాడ ఏ-కన్వెన్షన్ లో మానవ వనరులు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవం ఆద్యంతం పండుగ వాతావరణంలో జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల అభిప్రాయాలతో ఏర్పాటుచేసిన వాల్ బోర్డులను సీఎం, మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన మహనీయుడు డా.సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**ఉత్తమ ఉపాధ్యాయులు 175 మందికి ఘనంగా సత్కారం**

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో తూర్పుగోదావరి జిల్లా రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీచర్ రమ్యసుధ, కడప జిల్లా పోరుమామిళ్లలో ఏపీఎస్ఎస్ డీసీ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ పనిచేస్తున్న కే.వెంకట్రావులకు వేదికపై సీఎం చంద్రబాబునాయుడు పక్కనే కూర్చొనే అవకాశం కల్పించి సమున్నతంగా గౌరవించారు. అనంతరం 175 మందికి సీఎం, మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా

మిగతా 2వ పేజీలో..

## టీజీ తిమ్మయ్య శెట్టి సేవలు మరువలేని

**- మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్**




**కర్నూలు, న్యూస్ నేడు :** 1955 సంవత్సరం నుండి రెండు పర్యాయాలు ఆదోని, ఆలూరు ఎమ్మెల్యేగా పనిచేసిన టీజీ లక్ష్మయ్య శెట్టి సేవలు మరువలేనీవని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఈరోజు స్థానిక మద్దూర్ నగర్ నందు ఉన్న తెలుగు సూరన్న పార్కు నందు ఏర్పాటుచేసిన టీజీ లక్ష్మయ్య శెట్టి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ

మిగతా 2వ పేజీలో..

# పే-రివిజన్ కమిషన్ నియమిస్తాం

- 2 పెండింగ్ డీఏలను విడుదల చేస్తాం
- గత ప్రభుత్వం రద్దు చేసిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ
- ఈహెచ్ఎస్ స్ట్రీమ్ లైన్.. 2022 ఏడాది సరెండర్ లీవుల విడుదల
- ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, సెప్టెంబర్ 5 :** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 12వ పే-రివిజన్ కమిషన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే పెండింగులో ఉన్న 4 డీఏల్లో 2 డీఏల విడుదలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. వీటితో పాటు మరికొన్ని ముఖ్యమైన పెండింగ్ అంశాలకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్ర ఆదాయ-వ్యయాల లెక్కలను ఉద్యోగుల ముందు ఉంచారు. రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా.... ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలతతో ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మేరకు కొన్ని కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకరించారు. అలాగే 1-7-2024, 1-1-2025లకు చెందిన రెండు డీఏల విడుదలకు ఆమోదం తెలిపారు. ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. ఇక 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవులను వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాలో వేయడానికి అంగీకరించారు. ఇక పోలీసులకు 1 అడిషనల్ సరెండర్ లీవ్‌ను ఈ దసరాకు చెల్లించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇక గత ప్రభుత్వం రద్దు చేసిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి ఇచ్చేందుకు నిర్ణయించారు. దీంట్లో భాగంగా 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింప చేయనున్నారు. ఇక ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ చేస్తూ వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లింపులు జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల కోసం తీసుకున్న ఈ నిర్ణయాలతో ఏటా రూ.2,880 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు కానుంది.

**రూ.30 వేల కోట్లకు పైగా పెండింగ్ బకాయిలు చెల్లించాం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...” మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా... గత రెండేళ్ల కాలంలో ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు ఇస్తున్నాం.. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇస్తున్నాం. 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపచేశాం. ఉద్యోగులకు సంబంధించి ఉన్న పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ.30,849 కోట్లు క్లియర్ చేశాం. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వడ్డీలకు అప్పులు తెచ్చింది. ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై భారీగా ఉన్న వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించుకోగలిగాం. ప్రస్తుతం సరాసరి 9.1 శాతం వడ్డీని ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తోంది. ఈ భారాన్ని ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను నెమ్మదిగా గాడిన పెడుతున్నాం. గత పాలకులు ఉద్యోగులను

మిగతా 2వ పేజీలో..

## వినాయక నిమజ్జనానికి నీటి కొరత..

**ప్రజలు సహకరించాలి: మంత్రి టీజీ భరత్**



**కర్నూలు, న్యూస్ నేడు :** ప్రస్తుతం కర్నూలులో నీటి పరిస్థితులు అనుకూలంగా లేనందున ఈ ఏడాది వినాయక నిమజ్జన కార్యక్రమాల విషయంలో ప్రజలు సహకరించాలని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ కోరారు. సుంకేసుల డ్యామ్ లో నీరు నిల్వ లేనందున కేసి కెనాల్ కు నీటిని విడుదల చేసే అవకాశం లేదన్నారు. వినాయక చవితి, నిమజ్జన ఏర్పాట్లపై మంత్రి నివాసంలో మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు, వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులతో మంత్రి సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, రెండు అడుగుల లోపు విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. చిన్న విగ్రహాలను ఇళ్ల వద్దనే నిమజ్జనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది

మిగతా 2వ పేజీలో..

## గిరిజనుల జన్యు రక్త వ్యాధుల ముందస్తుగానే గుర్తింపు

- రాష్ట్రంలోనే ఉన్న ఏకైక ప్రత్యేక ల్యాబ్‌లో 3 నెలల్లో 121 పరీక్షలు
- 94 మందిలో సమస్యల గుర్తింపు
- వైజాగ్ లోని కెజీహెచ్ కేంద్రంగా పరీక్షలు, చికిత్స ఉచితం

**అమరావతి, సెప్టెంబర్ 5 :** గిరిజనుల ఆరోగ్యానికి మరింత భరోసా పెరిగింది. గిరిజన ప్రాంతాల్లో తలసేమియా, సికిల్‌సెల్ వంటి జన్యుపరమైన రక్త రుగ్మతలను ముందస్తుగా గుర్తించి, సకాలంలో వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రంలో తొలిసారిగా విశాఖలోని కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ కంపిటెన్స్ (సీఓసీ) ల్యాబ్ ద్వారా మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది మేలో ప్రారంభమైన ఈ కేంద్రం ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ప్రాంతీయ నిర్ధారణ కేంద్రంగా సేవలందిస్తోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టితో గిరిజన ప్రాంతాల ప్రజలకు అధునాతన వైద్య సేవలను చేరువ చేస్తున్నారు. ఈ క్రమంలో కేజీహెచ్ లో ఉన్న కేంద్రంలో ఇటీవల వరకు 121 రక్త నమూనాలను పరీక్షించగా, 94 నమూనాల్లో జన్యుపరమైన హీమోగ్లోబిన్ వైవిధ్యాలు లేదా క్యారియర్ స్థితులు గుర్తించారు. పరీక్షలు, జన్యు సలహాలు, క్లినికల్ మేనేజ్‌మెంట్ సేవలను ఉచితంగా అందిస్తున్నారు.

**94 మందిలో జన్యు వైవిధ్యాలు**

పరీక్షల్లో 33 మందిలో సికిల్‌సెల్ ట్రైట్ (హెచ్‌బీఏఎస్) క్యారియర్ స్థితి, 23 మందిలో హోమోజైగస్ సికిల్‌సెల్ వ్యాధి (హెచ్‌బీఎస్ఎస్) గుర్తించారు. మరో 10 మందిలో తలసేమియా ట్రైట్, ఆరుగురిలో తలసేమియా మేజర్, మరో ఆరుగురిలో సికిల్‌సెల్?తలసేమియా కలయిక ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇద్దరిలో హెచ్‌బీడీ, హెచ్‌బీసీ, హెచ్‌బీఈ వంటి అరుదైన హీమోగ్లోబిన్ వైవిధ్యాలు బయటపడ్డాయి. మొత్తంగా పరీక్షించిన 121

మిగతా 2వ పేజీలో..

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం

**ఉక్రెయిన్‌పై 3రోజుల పాటు దాడులను నిలిపివేసిన పుతిన్**



న్యూఢిల్లీ,సెప్టెంబర్5 : రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శాంతి చర్చలకు అమెరికా ప్రతినిధులు మాస్కో చేరుకున్న వేళ రష్యా-ఉక్రెయిన్ తాత్కాలికంగా దాడులను నిలిపివేశాయి. జెలెన్‌స్కీ, పుతిన్ ప్రకటించిన 3 రోజుల విరామం శాశ్వత శాంతి ఒప్పందానికి బాటలు వేస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ప్రకారం, శనివారం అర్ధరాత్రి నుంచి కీవ్‌పై మూడు రోజుల పాటు ఎలాంటి దాడులు జరపకూడదని పుతిన్ ఆదేశించారు. అమెరికా

మిగతా 2వ పేజీలో..

# 11 రోజుల తర్వాత సజీవంగా మరో ఇద్దరు

- 60 ఏళ్ల మహిళను రక్షించిన సిబ్బంది
- ఇంకా తీవ్రంగా శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు
- ఇప్పటివరకు 1,344కు చేరిన మృతుల సంఖ్య

**న్యూఢిల్లీ,సెప్టెంబర్5 :** నేపాల్‌ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదలు, కొండచరియల విరిగిపడటంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. విపత్తు సంభవించి 11 రోజులు గడిచినా, శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసేందుకు భద్రతా బలగాలు, అంతర్జాతీయ రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం ఇద్దరిని సజీవంగా రక్షించడం ఆశలు రేకెత్తించింది. ఒక విదేశీయుడిని అపర్ త్రిశూలీ-1 జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం నుంచి బయటకు తీసుకురాగా, మరో మహిళను నువాకోట్ జిల్లా బిదూర్‌లో కాపాడారు. మరోవైపు వరదల్లో ఇప్పటివరకూ మృతి చెందిన వారి సంఖ్య 1,344కు చేరింది. భోటేకోశీ వరదల ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న అపర్ త్రిశూలీ-1 ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న ఓ విదేశీయుడిని నేపాల్ సైన్యం సజీవంగా బయటకు తీసింది. రెస్క్యూ అనంతరం అతడిని హెలికాప్టర్ వద్దకు తరలించి వైద్య సిబ్బంది ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. అతడి



ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో నువాకోట్ పట్టణంలో.., ధ్వంసమైన ఒక ఇంటి నుంచి చండికా శ్రేష్ట అనే

మిగతా 2వ పేజీలో..

# 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

- దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్
- హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి
- గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం
- దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సిఎం రేవంత్

హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు.



ఈ డేటా సెంటర్ సామర్థ్యం గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు

మిగతా 2వ పేజీలో..

## ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు


అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, ఛైర్మన్?

సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్? కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు

మిగతా 2వ పేజీలో..

## పండుగ వాతావరణంలో గురుపూజోత్సవం





**మొదటి పేజీ తరువాయి..**

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు ప్రదానం చేశారు. వారిని శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం, మెడల్, జ్ఞాపికతో పాటు రూ.20వేల నగదు బహుమతిని అందజేశారు. పాఠశాల విద్యాశాఖ నుంచి 79 మంది, ఇంటర్మీడియట్ నుంచి 24, సాంకేతిక విద్య నుంచి 14, విశ్వవిద్యాలయాల నుంచి 35, కళాశాల విద్య నుంచి 17 మంది, ఇంజనీరింగ్, ఫార్మసీల నుంచి ఆరుగురికి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు బహూకరించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

## పే-రివిజన్ కమిషన్ నియమిస్తాం

**మొదటి పేజీ తరువాయి..**

దగ్గరకే రానీయలేదు. రివర్స్ పీఆర్సీ ఇచ్చారు... అలాంటి పరిస్థితులు ఉద్యోగులు మరిచిపోవద్దు. గత ప్రభుత్వం రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను కూడా పెండింగులో పెట్టింది. ఉద్యోగులను అవమానించేలా వాలంటరీలతో కరపత్రాలు పంపిణీ చేయించారు.. హోర్డింగులు పెట్టించారు... పేపర్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మధ్యవర్తులతోనే మాట్లాడే పరిస్థితి నాడు ఉండేది. సమస్యల పరిష్కారం కోసం నాటి సీఎం కాళ్లు పట్టుకోవాలని అప్పుడు మంత్రులుగా ఉన్న వారు కామెంట్లు చేశారు... అవమానించారు. మంచికి చెడుకు ఉన్న వ్యత్యాసాన్ని ఉద్యోగులందరూ గుర్తించాలి. మేం ఉద్యోగులను గౌరవిస్తున్నాం... సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నాం. రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదని వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సానుకూలంగా ఉంటాం. ఆర్థిక వెసులుబాటు ఉంటే ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. 2014లో నాడు విభజన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం. విభజనకు వ్యతిరేకంగా పోరాడింది ఉద్యోగులే. వారిని గౌరవించాలని.. ఇబ్బందులు వస్తాయని తెలిసినా... 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చాం. ఉద్యోగులు వారి సమస్యల గురించి.. యూనియన్ల కోసం పని చేస్తారు. నేను రాష్ట్రం కోసం... ప్రజల కోసం ఆలోచించాలి. ఇందులో ఉద్యోగులూ భాగమే."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**గత పాలకుల నిర్వాకం వల్ల పెళ్లిళ్లను వాయిదా వేసుకున్నాం:**

ఉద్యోగులుఉద్యోగుల పెండింగ్ సమస్యలను.. డిమాండ్లను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనపై సమావేశానికి హాజరైన ఉద్యోగ సంఘాల నేతల హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యల పట్ల సానుకూలత కనబరిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో పీఎఫ్ లోన్లను కూడా ఇవ్వకుండా వేధించడం వల్ల పెళ్లిళ్లను కూడా వాయిదా వేసుకున్న పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. రిటైర్మెంట్ ఉద్యోగులకు మేలు చేసేలా ఉన్న అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను గత ప్రభుత్వం రద్దు చేసింది. దాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్దరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సును పెంచినందుకూ కృతజ్ఞతలు తెలియచేశారు. రాష్ట్రానికున్న ఆర్థిక ఇబ్బందులను తాము అర్థం చేసుకున్నామని... రాష్ట్రాభివృద్ధికి, ప్రభుత్వానికి తమ వైపు నుంచి పూర్తి సహకారాన్ని అందిస్తామని ఉద్యోగులు వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి నీటి కొరత..

**మొదటి పేజీ తరువాయి..**

పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఇప్పటికే పెద్ద విగ్రహాలను తీసుకొచ్చిన వారు లేదా ఆర్డర్ ఇచ్చిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. అలాంటి విగ్రహాలను ఒకచోట భద్రంగా ఉంచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని, వచ్చే ఏడాది వాటితో వినాయక చవితి వేడుకలు నిర్వహించుకునేలా అవకాశం కల్పిస్తామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని అధికారులకు, ఉత్సవ కమిటీలకు సహకరించాలని మంత్రి టీజీ భరత్ విజ్ఞప్తి చేశారు. త్రాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారని తెలిపారు.

## టీజీ తిమ్మయ్య శెట్టి సేవలు మరువలేని

**మొదటి పేజీ తరువాయి..**

మోతుబరి వ్యవసాయ, పారిశ్రామిక కుటుంబం నుంచి వచ్చిన తన పెదనాన్న లక్ష్మయ్య శెట్టి స్వాతంత్ర సంగ్రామంలో ఎన్నడు వెన్ను చూపలేదు అన్నారు. ఎన్నోమార్లు లాఠీ దెబ్బలు తిని, పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చిన నైపథ్యం ఆయనకు ఉందన్నారు. స్వాతంత్రం అనంతరం కూడా అనునిత్యం ప్రజాసేవకే అంకితం అయ్యి రాజకీయాలు కొనసాగించారనీ అన్నారు. అప్పటి నుంచే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారని టీజీ వెంకటేష్ తెలిపారు. అటువంటి మహనీయుని విగ్రహాన్ని ఈరోజు ఆవిష్కరించడం ఎంతో ఆనందించదగ్గ విషయం అన్నారు. ఆనాటి ఎంతో మంది మహనీయుల త్యాగఫలమే నేటి తరాలు అనుభవిస్తున్నాయని, కావున అటువంటి వారి గురించి భవిష్యత్ తరాలకు తెలియ చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. దేశం కోసం, రాష్ట్రాల కోసం జీవితాలను త్యాగం చేసిన వారిని, కులాలకు పరిమితం చేయకుండా వారికి తగిన గౌరవం దక్కేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిటి వెంకటేష్ కోరారు. ఈ కార్యక్రమంలో టీజీ లక్ష్మయ్య సెట్టి కుటుంబ సభ్యులు పీజీ శివరాజ్, టీజీ తారనాథ్, తెలుగు భాషా వికాస ఉద్యమ నాయకులు చంద్రశేఖర్ కల్కూరా,ఎస్ ఆర్ కే శర్మ, డి వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల జన్యు రక్త వ్యాధుల ముందస్తుగానే గుర్తింపు

**మొదటి పేజీ తరువాయి..**

నమూనాల్లో 94 అంటే 77.7 శాతం నమూనాల్లో జన్యుపరమైన హీమోగ్లోబిన్ వైవిధ్యాలు లేదా క్యారియర్ స్థితులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

**రూ.2.85 కోట్లతో మౌలిక వసతులు**

కేంద్రం ఏర్పాటుకు రూ.2.85 కోట్ల విలువైన పరికరాల మౌలిక వసతులు సమకూరాయి. పరికరాల నిర్వహణ కోసం రూ.16.93 లక్షలు వార్షిక నిర్వహణ ఒప్పందాల (ఏఎంసీ) కింద కేటాయించారు. రియాజెంట్లు, పరీక్షా కిట్ల కోసం రూ.45.54 లక్షలు కేజీహెచ్ సీఎఫ్ఎంఎస్ ఖాతాకు జమ చేసి వినియోగానికి కేటాయించారు. ఈ సహకారంతో కేంద్రంలో నిర్వహించే నిర్ధారణ పరీక్షలు, జన్యు సలహాలు, క్లినికల్ మేనేజ్‌మెంట్ సేవలను రోగులకు 100 శాతం ఉచితంగా అందిస్తున్నామని కెజీహెచ్ సూపరింటెండెంట్ ఇ. వాణి తెలిపారు.

# కేబినెట్ మార్పు చేర్పులకు కసరత్తు!?

- అసెంబ్లీ సమావేశాలు ముగియగానే కార్యాచరణ
- ప్రస్తుతం కేబినెట్‌లో మూడు ఖాళీలు
- నామినేటెడ్ పదవులు కూడా ఒకే సారి భర్తీ
- సరిగ్గా పని చేయని వారికి తప్పని ఉద్వాసన

**హైదరాబాద్,సెప్టెంబర్5:** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో అత్యంత కీలకమైన రాజకీయ ఘట్టానికి తెరలేపుతోంది. మంత్రివర్గంలో మార్పుచేర్పులు ,ఖాళీల భర్తీ ప్రక్రియను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి తుది అనుమతి లభించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగియగానే ఈ విస్తరణ ప్రక్రియను పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ పరిణామం కేవలం పదవుల పెంపకానికే పరిమితం కాకుండా, పార్టీపై , పాలనపై సీఎం తన పట్టును మరింత బిగించే ప్రక్రియగా కనిపిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ కేబినెట్‌లో సాంకేతికంగా ఖాళీలు ఏర్పడగా, కొండా సురేఖ బర్తరఫ్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రాతినిధ్యంతో పాటు బీసీ మహిళా స్థానం ఖాళీ అయింది. అంటే ప్రస్తుతం మూడు ఖాళీలు ఉన్నాయి. దీంతో పాటు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రాతినిధ్యాన్ని కల్పించడం సీఎం రేవంత్ ముందున్న ప్రధాన లక్ష్యం. మూడేసి ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, పనితీరు సరిగ్గా లేని కొంతమంది మంత్రుల శాఖలను మార్చడం లేదా వారి స్థానంలో నూతన ముఖాలకు అవకాశం కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రణాళిక సిద్ధమైంది. కొండా సురేఖను తప్పించిన వెంటనే, నష్ట నివారణ చర్యల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ముగ్గురు కీలక బీసీ మహిళా నేతలకు ఉన్నతమైన నామినేటెడ్ పదవులను కట్టబెట్టడం ద్వారా తన సామాజిక వ్యూహాన్ని చాటుకున్నారు. కేబినెట్ హోదా కలిగిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా గద్వాల విజయలక్ష్మి , మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద , కుడా ఛైర్‌పర్సన్‌గా గుండు సుధారాణిలను నియమించడం ద్వారా బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశామనే సంకేతాన్ని పంపించారు. ఇదే సూత్రాన్ని రాబోయే కేబినెట్ భర్తీలోనూ పాటిస్తూ ఒక బీసీ మహిళకు మంత్రిపీఠం దక్కేలా రేవంత్ ప్రణాళికలు రచిస్తున్నారు. మరోవైపు, పాత కాంగ్రెస్ నేతలు , కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతల మధ్య సమన్వయం పాటించడం ఈ కేబినెట్ విస్తరణలో రేవంత్ రెడ్డికి ఎదురుకానున్న పెద్ద పరీక్ష. పార్టీ కోసం మొదటి నుంచీ కష్టపడిన సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. అధిష్టానంతో ఉన్న సత్సంబంధాలను ఉపయోగిస్తూ ఢిల్లీ స్థాయిలో పావులు కదుపుతున్నారు. అయితే, మంత్రివర్గంలో కేవలం రాజకీయ సమీకరణాలే కాకుండా, రాబోయే స్థానిక సంస్థలు మరియు మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి ఉపయోగపడే డైనమిక్ నాయకులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ విస్తరణ ద్వారా రేవంత్ రెడ్డి కేవలం ఖాళీలను పూరించడమే కాకుండా, పనితీరు సరిగ్గా లేని మంత్రులకు హెచ్చరిక పంపేలా పెర్ఫార్మెన్స్ బేస్డ్ ప్రక్షాళన చేయనున్నారు. ఐటీ, రెవెన్యూ, నీటిపారుదల వంటి కీలక శాఖలు తప్ప మిగిలిన శాఖల్లో పనితీరును సమీక్షించి, సమర్థులైన అధికారులకు మరియు మంత్రులకు తగిన రీతిలో పోర్ట్‌ఫోలియోలను పునర్విభజించే అవకాశం ఉంది. ఈ దిశగా ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు కూడా పూర్తవ్వడం పాలనాపరమైన మార్పులకు సంకేతంగా నిలుస్తోంది.రాబోయే కేబినెట్ విస్తరణ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఒక రకమైన పొలిటికల్ రీసెట్ కాబోతోంది. అంతర్గత అసమ్మతికి తావులేకుండా, సామాజిక న్యాయాన్ని కాపాడుతూ, నామినేటెడ్ పదవులు , కేబినెట్ బెర్త్‌లను ఒకేసారి భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వంపై మరియు కాంగ్రెస్ క్యాడర్‌పై తన అజమాయిషీని రేవంత్ రెడ్డి మరోసారి నిరూపించుకోనున్నారు.

# 11 రోజుల తర్వాత సజీవంగా మరో ఇద్దరు

**మొదటి పేజీ తరువాయి..**

64ఏళ్ల వృద్ధురాలిని సహాయ సిబ్బంది ప్రాణాలతో బయటకు తీశారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను హెలికాప్టర్‌లో కాఠ్‌మాండ్ తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యంత దయనీయ స్థితిలో ఉన్న వృద్ధురాలిని దుప్పటిలో చుట్టి ఇంటి నుంచి బయటకు మోసుకెళ్తున్న దృశ్యాలను నేపాల్ సైన్యం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ఇప్పటికే శుక్రవారం త్రిశూలీ-3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం నుంచి ఇద్దరు నేపాలీలను సజీవంగా బయటకు వచ్చారు. వరదల్లో కొట్టుకుపోయిన మృతదేహాలు ఎక్కువగా నీటిలో ఎక్కువకాలం ఉండటం, బురద, శిథిలాల కింద చిక్కుకోవడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా లభించకపోవడంతో మృతుల గుర్తింపు అధికారులకు పెద్ద సవాలుగా మారింది. ఇప్పటివరకు అవసరమైన ప్రక్రియలు, డీఎన్ఏ నమూనాల సేకరణ పూర్తయ్యాక 1,030 మృతదేహాలను తాత్కాలికంగా ఖననం చేశారు. అయితే గుర్తింపు పూర్తైన 96 మృతదేహాలను మాత్రమే కుటుంబాలకు అప్పగించారు. మృతుల గుర్తింపులో డీఎన్ఏ పరీక్షలు కీలకంగా మారాయి. ఇందుకోసం మృతదేహాల నుంచి సేకరించిన నమూనాలను కుటుంబ సభ్యుల జీవ నమూనాలతో సరిపోల్చాల్సి ఉంటుంది. నువాకోట్‌లోని తాత్కాలిక ఫీల్డ్ ఆసుపత్రిలో డీఎన్ఏ నమూనాల సేకరణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. నేపాల్ సైన్యం సుమారు 20 హెలికాప్టర్లను సహాయక చర్యలకు వినియోగిస్తోంది. నువాకోట్, రసువా జిల్లాల్లో గాలింపు, రక్షణ, సహాయక సామగ్రి పంపిణీ నిరంతరం కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణం, ప్రమాదకరమైన పర్వత ప్రాంతాలు, వరదలకు దెబ్బతిన్న హెలిప్యాడ్‌ల కొరత ఉన్నప్పటికీ హెలికాప్టర్లు సహాయక చర్యలు నిర్వహిస్తున్నాయి. నువాకోట్‌లో ఉప్పొంగిన టాడీ నదిపై తాత్కాలిక తాడు వంతెన నిర్మించేందుకు సైనిక ఇంజినీరింగ్ బృందాలు పనిచేస్తున్నాయి. రహదారి సంబంధాలు తెగిపోయిన ప్రాంతాలకు భూసంబంధిత రవాణాను పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ పనులు సాగుతున్నాయి. ఈ విపత్తులో ఇప్పటివరకు 1,344 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో దాదాపు 5 వేల మంది ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. గల్లంతైన వారిలో కనీసం 589 మంది విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 13 వేల మందికి పైగా ప్రజలను రక్షించారు. నేపాల్‌లోని ఎనిమిది జిల్లాల్లో మృతదేహాలు లభ్యమయ్యాయి. చిత్వాన్‌లో అత్యధికంగా 360 మృతదేహాలు లభించగా, పశ్చిమ నావల్‌పరాసీలో 230, తూర్పు నావల్‌పరాసీలో 222 మృతదేహాలు వెలికితీశారు. మిగిలినవి నువాకోట్, రసువా, గోర్ఖా, ధాదింగ్, తనహున్ జిల్లాల్లో లభించాయి.

## 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

**మొదటి పేజీ తరువాయి..**

ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. "ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది.టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్" వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి" అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి.దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## క్రాంతినగర్‌లో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



**నంద్యాల, న్యూస్ నేడు:** నంద్యాల పట్టణం, క్రాంతినగర్ లో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నందు గత ఐదురోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ప్రముఖ వ్యాఖ్యాత ఉపన్యాసకులు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులుచే శ్రీమద్రామాయణం, మహాభారతం, భాగవతాలపై ధార్మిక ప్రవచనాలు, ప్రతిరోజు బాలనాగిరెడ్డి బృందంచే భజనలు, ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక అర్చకులు వై. సి.సంగీత్ కుమార్ భక్తులందరితో సామూహిక కుంకుమార్చనలు, గోమాతకు పూజలు చేయించారు. ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలనుకున్నవారికి తి.తి.దే. సహకరిస్తుందని తి.తి.దే. హిందూ ధర్మప్రచారపరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.వెంకటేశ్వర రెడ్డి, మిట్టా వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డి, అంగడి సుబ్బారెడ్డి, జి. చెన్నారెడ్డి, జి. చెన్నారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మి, స్వప్న, కృష్ణకుమారి, పక్కీరమ్మా, ప్రమీల, రమాదేవి, కుమారి, తులశమ్మతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి..**

హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉందని గుత్తా అన్నారు.సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి? ఆదేశించారు. సభ్యులకు అందించే మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్, ఛైర్మన్? ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలు, రాస్తారోకోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు చేరేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు.సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందే అందించాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉభయ సభల సమావేశాలు ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. ఈ వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ-బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, కొత్త బిల్లుల ఆమోదం లాంటివి ప్రభుత్వ అజెండాగా ఉంటాయి.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం

**మొదటి పేజీ తరువాయి..**

ప్రతినిధుల ఉక్రెయిన్ పర్యటన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విట్‌కాఫ్, కుష్నర్ శనివారం మాస్కో చేరుకున్నారు. రష్యా ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రియేవ్ విమానాశ్రయంలో వారికి స్వాగతం పలికారు. 'వెల్‌కమ్ టు మాస్కో పీస్‌మేకర్స్' అంటూ వారి రాకకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అమెరికా ప్రతినిధులు ఆదివారం కీవ్‌కు వెళ్లే అవకాశం ఉంది. గతంలో వీరు మాస్కోను సందర్శించినప్పటికీ, కీవ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. అమెరికా ప్రతినిధుల పర్యటన సమయంలో ఉక్రెయిన్ కూడా వైమానిక దాడులను నిలిపివేస్తుందని అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఇప్పటికే ప్రకటించారు. రష్యా కూడా ఇదే విధంగా వ్యవహరించాలని ఆయన కోరారు. అయితే అమెరికా ప్రతినిధుల రాకకు ముందు రష్యా కీవ్, బోరిస్పిల్ అంతర్జాతీయ విమానాశ్రయాలపై దాడులు చేసిందని జెలెన్‌స్కీ ఆరోపించారు. అమెరికా ప్రతినిధులు విమానంలో ఉక్రెయిన్‌కు చేరుకునే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ దాడులు జరిగి ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. తమ డ్రోన్లు, క్షిపణుల కారణంగా రష్యా గగనతలం కూడా ప్రమాదకరంగా మారిందని పేర్కొన్న జెలెన్‌స్కీ, తదుపరి వారంలో రష్యా గగనతలానికి సంబంధించి తమ చర్యలను సర్దుబాటు చేసుకుంటామని తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఐదో ఏడాదిలోకి ప్రవేశించినప్పటికీ, కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం విషయంలో ఇప్పటివరకు స్పష్టమైన పురోగతి కనిపించలేదు. దాదాపు 1,250 కిలోమీటర్ల ఫ్రంట్‌లైన్‌లోనూ ఇరు దేశాల దళాలు పెద్దగా ముందడుగు వేయలేకపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అమెరికా ప్రతినిధుల మాస్కో, కీవ్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. పుతిన్ ప్రకటించిన 72 గంటల దాడుల విరామం చర్చలకు అనుకూల వాతావరణం కల్పిస్తుందా? అమెరికా మధ్యవర్తిత్వంతో ఇరు దేశాలు మళ్లీ చర్చల బాట పడతాయా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.శాంతి చర్చలు నిలిచిపోవడంతో ఇటీవలి కాలంలో రష్యా ఉక్రెయిన్‌పై వైమానిక దాడులను మరింత తీవ్రతరం చేసింది. కీవ్‌తో పాటు పలు నగరాలపై రాత్రి మాత్రమే కాకుండా పగటి వేళల్లోనూ దాడులు జరుగుతున్నాయి. శుక్రవారం రష్యా డ్రోన్ కీవ్‌లోని ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్ (ఎస్?బీయూ) ప్రధాన కార్యాలయాన్ని ఢీకొట్టింది. రష్యాలోని సైనిక లక్ష్యాలపై దీర్ఘశ్రేణి దాడులు నిర్వహిస్తున్న ఉక్రెయిన్ సంస్థల్లో ఎస్?బీయూ కూడా ఒకటి. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలోని సైనిక స్థావరాలు, చమురు శుద్ధి కేంద్రాలు, ఇతర కీలక ఆర్థిక మౌలిక వసతులపై డ్రోన్, క్షిపణి దాడులు చేస్తోంది. రష్యా యుద్ధ సామర్థ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతో పాటు యుద్ధ ప్రభావాన్ని అక్కడి ప్రజలకు తెలియజేయాలన్నది ఉక్రెయిన్ వ్యూహంగా కనిపిస్తోంది. రష్యా రోస్టోవ్, వొరోనెజ్ ప్రాంతాల నుంచి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడంతో పాటు రాత్రికి 167 దాడి డ్రోన్లను ఉపయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. వీటిలో షహెద్ తరహా డ్రోన్లతో పాటు జెరాన్, డీకాయ్ డ్రోన్లు ఉన్నాయని పేర్కొంది. ఉక్రెయిన్ వైమానిక రక్షణ వ్యవస్థలు 128 డ్రోన్లను కూల్చివేయడం లేదా అడ్డుకోవడం జరిగిందని అధికారులు తెలిపారు.

ఆదివారం,
సెప్టెంబర్ 6 2026
న్యూస్ నేడు
newsnedu.com

## సరైనవ్యక్తిని ఎన్నుకోవడం మన వార్డులో మన బాధ్యత



**మదనపల్లె సెప్టెంబర్ 5, న్యూస్ నేడు ప్రతినిధి :** మన వార్డు మన బాధ్యత తో సక్ర మంగా, సరైన వ్యక్తిని వార్డు కౌన్సిలర్ గా , మునిసిపల్ వైస్ చైర్మన్ గా ఎన్ను కున్నప్పుడే, మన వార్డు సమస్యలు పరిష్కారం చేసే ప్రయత్నం జరుగు తుంది, అభివృద్ధి చేస్తారు. మన వార్డులో ఏ సమస్య ఉన్నా, మనకు తెలిసిన వెంటనే స్పందించే వ్యక్తి కావాలి. అలా సహృదయంతో స్పందిస్తు, నిస్వార్థం గా ప్రజలకు సేవ లు అందిస్తున్న వ్యక్తి డా. అప్పిన పల్లి భాస్కరాచారి. ఏబిసి సేవా సంస్థ ద్వారా ఎంతో మందికి ఎన్నో విధాలుగా సేవలు అందిస్తున్న గొప్ప వ్యక్తి, అంతే కాకుండా దృష్టిలో పాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు లయిన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గా అప్పన్నపల్లి భాస్కరాచారి నిస్వాతంగా అంది స్తున్న సేవలు ఎనలేనివి. కావున రానున్న మునిసి పల్ ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్ గా, మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నికైతే ప్రజలకు సేవలు అందించడమే కాకుండా అభివృద్ధి కి పునరుకితం అవుతాడనడం లో అతిశ యోక్తి లేదు.

## 12వ రోజుకు చేరిన శాంతియుత దీక్ష





**ప్యాపిలి న్యూస్ నేడు:** ప్రజల సమస్యలు పరిష్కరించే వరకు శాంతియుత దీక్ష కొనసాగిస్తామని సింగిల్ విండో అధ్యక్షుడు సీమా సుధాకర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ సుదర్శన్, టీడీపీ నాయకులు బోయినచెరువుపల్లి కృష్ణయ్య, రజినీ యాదవ్ తెలిపారు.శనివారం ప్యాపిలి మండలంలోని శ్రీపురం గ్రామంలోని ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, ప్రజాప్రతినిధులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 12వ రోజు శాంతియుత దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ప్రభుత్వం, అధికారులు స్పందించి తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాలలో టీచర్స్ డే



**కర్నూలు, న్యూస్ నేడు:** శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాల నందు టీచర్స్ డే ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి హరి కిషన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేయడం జరిగింది. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం గురించి తెలియజేయడం జరిగింది. టీచర్స్ ని గౌరవించడం వారు చెప్పేటువంటి విలువలను పాటించి జీవితంలో ఉన్నతమైన స్థాయికి ఎదగాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ అడ్వైజర్ వసంత కుమారి మరియు కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## స్థానిక ఎన్నికలపై గ్రామ సభ



**ప్యాపిలి న్యూస్ నేడు:** రాబోయే స్థానిక ఎన్నికలకు సంబంధించి ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే గ్రామ సభలో తెలియజేయాలని స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓ నాగేశ్వరరావు సూచించారు.ప్యాపిలి పట్టణ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల సమస్యలు, ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రజలతో చర్చించారు.ప్యాపిలి పట్టణంలో మొత్తం 11,533 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు. వీరిలో ఎస్సీలు 1,030, బీసీలు 8,271, ఎస్టీలు 286, ఇతరులు 1,946 మంది ఉన్నారని, పురుష ఓటర్లు 5,550, మహిళా ఓటర్లు 5,983 మంది ఉన్నారని వెల్లడించారు.కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులే విద్యార్థుల జీవి తాలకు మార్గ దర్శకులు

- **జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**
- **ఉపాధ్యాయులే దేశ నిర్మాణానికి పునాదులు**
- **మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా**
- **ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానం**





మదనపల్లె సెప్టెంబర్ 5, న్యూస్ నేడు ప్రతినిధి : ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠాలు బోధించ డానికే పరిమితం కాకుండా విద్యార్థు లకు మెంటర్లుగా, మార్గదర్శకులుగా నిలవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. శనివారం మదనపల్లె పట్టణం లోని ఎస్.ఆర్.కె. కన్వెన్షన్ హాలులో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు పండుగ వాతా వరణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తో పాటు మదనపల్లె శాసన సభ్యులు షాజహాన్ బాషా, డీఈవో సుబ్రహ్మణ్యం, సర్వ శిక్ష అభియాన్ ఏడి అనురాధ, ఎంఈఓ లు, ఉపాధ్యా యులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితం లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలక మన్నారు. తన జీవితంలోనూ పదో తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహం, మార్గ దర్శకత్వమే సరైన దిశను చూపించిం దని తెలిపారు. విద్యార్థులకు మంచి అలవాట్లు అలవర్చడంతో పాటు సరైన కెరీర్ ఎంపికలో మార్గ నిర్దేశం చేయాలని సూచించారు.

ఎప్పటికప్పుడు విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభను గుర్తించి వాటిని ఏ విధంగా సమాజా నికి ఉపయోగ పడుతుందో గుర్తించి ముందుకు నడిపేవారే గురువులు అన్నారు. ఉపాధ్యా యులు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తు న్నారన్నారు.

'మై స్కూల్ -- మై ప్రైడ్' కార్యక్రమం ద్వారా విద్యార్థుల విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి కృషి చేయాలని సూచించారు.

మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లా డుతూ ఉపాధ్యా య దినోత్సవాన్ని దేశ నిర్మాణ దినోత్సవం గా భావించాలని అన్నారు.

ఉపాధ్యాయులే విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్ది, మంచి సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తారని తెలిపారు.


మదనపల్లె విద్యా రంగానికి ప్రత్యేక గుర్తింపు కలిగిన ప్రాంతమని, శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన జెడ్పీ హైస్కూల్, బీటీ కళాశాల వంటి విద్యాసంస్థలు ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాయని చెప్పారు.

ఈ సందర్భంగా జిల్లాలోని టీచర్లు కు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అతిథులు 60 మంది ఉపాధ్యాయులను పేరుపేరునా ఆత్మీయంగా పలకరిస్తూ ఘనంగా సన్మానం చేశారు. అంతకు ముందు పీపుల్స్ స్కూల్ బి కొత్తకోట, చైతన్య ఆశ్రమం మదనపల్లి,ఆర్ బి డ్యాన్స్ స్టూడియో మదనపల్లి,గీతా వాణి స్కూల్ మదనపల్లి,జడ్పీ హైస్కూల్ బసినికొండ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో డీఈఓ కె.సుబ్రహ్మణ్యం, సర్వ శిక్ష అభియాన్ ఏడి అనురాధ, డిప్యూటీ డిఈఓలు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన పురుం వెంకట రమణ

- **జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు కైవసం**
- **ప్రదానం చేసిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జిల్లా కలెక్టర్**





**మదనపల్లె సెప్టెంబర్ 5, న్యూస్ నేడు ప్రతినిది :** మదనపల్లె పట్టణం వివేకానంద మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పురుం వెంకటరమణ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చారని,ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గా అవార్డు ఎంపిక చేయగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మదన పల్లె పట్టణంలో జరిగిన ఓ కార్య క్రమంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అవార్డును ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా నాయకులు మాట్లాడుతూ దాదాపు 15 సంవత్సరాలుగా ఇంగ్లీష్,సోషల్ స్టడీస్ సబ్జెక్టులను పదవ తరగతి విద్యార్థులకు భోధించి డివిజన్ స్థాయిలో అనేక సార్లు ప్రథమ స్థానంలో నిలిపి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి రెండుసార్లు పదోతరగతి ఫలితాల్లో పాఠశాలను మొదటి స్థానంలో నిలిపిన ఘనత ఆయనకే దక్కు తుందన్నారు.రాత్రి తొమ్మిది వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించి అదనంగా ఎన్.ఎం.ఎం.ఎస్ లో అటు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అనేకసార్లు ఉత్తమ ఫలితాలు సాధించా రని గుర్తుచేశారు. కరోనా సమయంలో దాతల సహకారం తో చనిపోయిన 23 మంది చేనేత కార్మిక కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిం చడం, అలాగే వందల కుటుంబా లకు నిత్యావస రాలు అందజేసి దాతృత్వం చాటు కున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తాను పని చేస్తున్న పాఠశాలలో మౌలిక వసతుల కోసం ప్రజా ప్రతినిధుల తోనూ మరియు అధికారులుతోను సత్సంబంధాలు కలిగి ఉండి వారి సేవలు పాఠశాలకు ఉపయోగపడినట్లు కృషిచేసి అటు ఉపాధ్యాయులకు ఇటు చేనేత కార్మికులకు ఏ కష్టం వచ్చినా ముందుండి అండగా పురం వెంకటరమణ నిలుస్తున్నారన్నారు.జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందు కోవడం గర్వంగా ఉందని,భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డిఇఓ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష ఏపిసి నున్నా అనురాధ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.50 లక్షలతో నూతన షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన

**రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేస్తాం: మంత్రి టీజీ భరత్**





**కర్నూలు, న్యూస్ నేడు :** కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.50 లక్షలతో నిర్మించనున్న నూతన షెడ్ నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తీపాటి నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందన్నారు. రైతులు, ప్రజల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో ఉల్లి ధరలు పడిపోయిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి రైతులకు అండగా నిలిచారని మంత్రి గుర్తుచేశారు. రైతులకు మార్కెట్ యార్డులో మెరుగైన వసతులు కల్పించడంలో భాగంగా నూతన షెడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మరో 30 నుంచి 40 కొత్త షాపులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. మార్కెట్ యార్డు అభివృద్ధి, కార్యకలాపాలు పెరగడంతో ఈ ఏడాది మార్కెట్ యార్డు ఆదాయం రూ.8 కోట్లకు పెరిగిందన్నారు. కర్నూలు నగరంలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, మార్కెట్ యార్డు చైర్మన్ అజ్మత్ బి, సెక్రటరీ జయలక్ష్మి, వైస్ చైర్మన్ శేషగిరి శెట్టి, డైరెక్టర్లు హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్లకు ఎస్టీయూ మండల శాఖ ఘన సన్మానం

**ప్యాపిలి న్యూస్ నేడు:** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్యాపిలి మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో సీనియర్ ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షులు జి. మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ఎస్టీయూ సాంస్కృతిక వ్యవహారాల కమిటీ కో-కన్వీనర్ ఇ. వెంకట నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు.ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏనుగుమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు సి. రామాంజినేయులు, ఎన్. రంగాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. రమేష్, చిన్నపూదిల్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు విద్య, ఉపాధ్యాయ సంక్షేమం, గౌరవ గుర్తింపుల కోసం ఎస్టీయూ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి బి.వై. మద్దిలేటి మాట్లాడుతూ సన్మాన గ్రహీతలు విద్యార్థుల అభ్యున్నతితో పాటు ఉపాధ్యాయుల ఉన్నతికి ఎంతో కృషి చేశారని తెలిపారు.రామాంజినేయులు రూపొందించిన ఇన్‌కమ్ ట్యాక్స్ సాఫ్ట్‌వేర్, మధ్యాహ్న భోజనం, పే ఫిక్సేషన్ తదితర సాఫ్ట్‌వేర్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అధికారులు వినియోగిస్తున్నారని ప్రశంసించారు.



కార్యక్రమంలో బి. చంద్రమౌళి, పవిత్రన్ రావు, సుదర్శన్ రెడ్డి, పరమేష్, యాస్మిన్, రజిత తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలుకు హైకోర్టు బెంచ్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.. న్యాయపరమైన ప్రక్రియ ప్రకారమే బెంచ్ ఏర్పాటు
- మంత్రి టీజీ భరత్



**కర్నూలు, న్యూస్ నేడు :** కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయంలో న్యాయవాద సోదరులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు.
హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని తాను వ్యక్తిగతంగా కలిసి చర్చించానని మంత్రి తెలిపారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్ తప్పకుండా వస్తుందని ముఖ్యమంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ కూడా ఈ అంశంపై స్పష్టత ఇచ్చారని తెలిపారు. మంత్రి కార్యాలయంలో కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రుడు, జనరల్ సెక్రటరీ టి. మహేశ్వరరెడ్డి, సీనియర్ న్యాయవాది జయరాజు, ఫ్యామిలీ కోర్టు పీపీ శ్రీనివాస్ భట్, టీడీపీ స్టేట్ లీగల్ సెల్ సెక్రటరీ దాసెట్టి శ్రీనివాసులు, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీశ్, టీడీపీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు గణేష్ సింగ్, సీనియర్ న్యాయవాది రవికాంత్ తదితరులతో మంత్రి సమావేశమై హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై చర్చించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు అనేది న్యాయపరమైన ప్రక్రియ, నిర్దేశిత విధివిధానాలకు అనుగుణంగా జరగాల్సిన అంశమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా ఉందని, ఇప్పటికే ముఖ్యమంత్రి స్థాయిలో స్పష్టమైన హామీ లభించిందని తెలిపారు. కాబట్టి న్యాయవాద సోదరులు తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం లేదని, వెంటనే తమ విధులకు హాజరుకావాలని ఆయన కోరారు.

# ఘనంగా అశోకా స్పోర్ట్స్ అరేనా ప్రారంభం



**కర్నూలు ఎడ్యుకేషన్ , న్యూస్ నేడు :** విద్యార్థినిలలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దారుఢ్యం, మానసిక ఆరోగ్యం, జట్టు స్ఫూర్తి మరియు ప్రతి రంగంలోనూ అత్యుత్తమ ప్రతిభను సాధించే లక్ష్యంతో కర్నూలులోని అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా అశోకా స్పోర్ట్స్ అరేనాను సెప్టెంబర్ 5న ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి కర్నూలు మాంటిస్సోరి పాఠశాలల కరస్పాండెంట్ డా. గయాని రాజశేఖర్ మరియు కర్నూలు విశ్వభారతి మెడికల్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డా. డి. నిఖేతన్ రెడ్డి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీ అశోక్ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినిల భవిష్యత్తుకు కేవలం విద్యా ప్రతిభ మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి మరియు పట్టుదల పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా కళాశాలలో అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు.డా. గయాని రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థినుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం మరియు క్రమశిక్షణ పెరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే క్రీడలను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.డా. డి. నిఖేతన్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన శరీరంలోనే ఆరోగ్యకరమైన మనస్సు ఉంటుందని అన్నారు. నేటి విద్యార్థినిలు ఎక్కువ సమయం చదువులు, సాంకేతిక పరికరాలకే కేటాయిస్తున్న నేపథ్యంలో శారీరక వ్యాయామం మరియు క్రీడలకు సమయం కేటాయించడం ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని చెప్పారు.కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ అరేనా విద్యార్థినిలకు వివిధ క్రీడలు మరియు శారీరక కార్యకలాపాల్లో పాల్గొనేందుకు మంచి వేదికగా నిలవనుంది. దీని ద్వారా విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేసుకోవడంతో పాటు వివిధ స్థాయిల్లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సాహం లభించనుంది.క్రీడలు విద్యార్థుల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని, ఒక జట్టుగా కలిసి పనిచేయడం ద్వారా సహకారం, నాయకత్వం మరియు బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం అభివృద్ధి చెందుతుందని అతిథులు తెలిపారు.విద్యతో పాటు క్రీడలు, శారీరక దారుఢ్యం, మానసిక ఆరోగ్యం మరియు వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడమే కళాశాల లక్ష్యమని యాజమాన్యం తెలిపింది.అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అశోకా స్పోర్ట్స్ అరేనా ప్రారంభం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరో ముందడుగుగా నిలిచింది

------

# సినిమా రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

**ఆర్అండ్‌బీ శాఖకు ఎస్‌డీపీఐ 7వ వార్డు, కాలనీ ప్రజల కృతజ్ఞతలు**





**హొళగుంద న్యూస్ నేడు:** హొళగుందలోని సినిమా రోడ్డుపై వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రజల భద్రతను కాపాడేందుకు నాలుగు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసిన ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు ఎస్‌డీపీఐ 7వ వార్డు తరఫున, కాలనీ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఇటీవల ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో సినిమా రోడ్డుపై నూతన తారు రోడ్డు ఏర్పాటు చేశారు. రహదారి నిర్మాణంతో వాహనాలు అధిక వేగంతో ప్రయాణించే అవకాశం ఉండటంతో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని గుర్తించిన ఎస్‌డీపీఐ 7వ వార్డు నాయకులు ప్రజల భద్రత దృష్ట్యా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు మెమోరాండం అందజేశారు.ఎస్‌డీపీఐ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన అధికారులు సినిమా రోడ్డుపై నాలుగు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం పట్ల కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయడం తమ బాధ్యత అని ఎస్‌డీపీఐ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డీపీఐ 7వ వార్డు ఇన్‌చార్జ్ కె. జావిద్ బాషా, ఈబీఆర్ అయూబ్, సామీయుల్లా, ముజీబ్ తదితరులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు తీపి కబురు: 12వ పీఆర్సీకి సీఎం గ్రీన్ సిగ్నల్

**ఉద్యోగుల డిమాండ్లపై సీఎం చంద్రబాబు సానుకూల నిర్ణయం**



**విజయవాడ న్యూస్? నేడు:** ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించారని ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు తెలిపారు.చర్చల అనంతరం సీఎం తీసుకున్న నిర్ణయాల వివరాలను ఆయన వెల్లడించారు.12వ పీఆర్సీ నియామకానికి అంగీకారం తెలిపారు.1-7-2024, 1-1-2025 తేదీలకు సంబంధించిన రెండు డీఏలను వచ్చే అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు .2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవులను వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయనున్నారు.పోలీసులకు ఒక అదనపు సరెండర్ లీవును ఈ దసరాకు చెల్లించనున్నారు.70 ఏళ్లు పైబడిన పింఛనుదారులకు 10 శాతం, 75 ఏళ్లు పైబడిన వారికి 15 శాతం చొప్పున అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 2027 జనవరి నుంచి వర్తింపజేయాలని నిర్ణయించారు.ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని క్రమబద్ధీకరిస్తూ, వచ్చే నెల నుంచి ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లింపులు జరపనున్నారు.ఈ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేసిన జేఏసీ చైర్మన్ రవీంద్ర రాజు, సీఎం క్యాంప్ కార్యాలయంలో స్వయంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, పరిష్కారానికి కృషి చేసిన రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లకు జేఏసీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ముఖ్యమంత్రికి మెమెంటో అందజేసి శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జేఏసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సూరిపల్లి రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాటకొండ శ్రీనివాస్, మిరియాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలను పరిష్కరించిన ఏ డి ఈ శ్రీనివాసులు



కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**చాగలమర్రి సెప్టెంబర్ 5 ( న్యూస్ నేడు) :** సమస్య ఎక్కడైనా సరే తక్షణమే స్పందించి వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా అందించడమే తమ లక్ష్యమని ఆళ్లగడ్డ విద్యుత్ సబ్ డివిజనల్ అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం
ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి ఆదేశాల మేరకు మండల కేంద్రమైన చాగలమర్రిలో గత 40 సంవత్సరాల క్రితం వేసిన ఇనుప విద్యుత్ స్తంభాలు త్రుప్పు పట్టి ఉండడం మరియు వర్షాకాలంలో తడిగా ఉన్నప్పుడు స్తంభాలకు విద్యుత్ షాక్ సర్క్యూట్ రావడం చాలా ఇబ్బందిగా ఉండడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి దృష్టికి తీసుకొని పోవడంతో ఎమ్మెల్యే గారి ఆదేశాలతో ఆళ్లగడ్డ ఎలక్ట్రికల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు గారు సమస్యను పూర్తిగా పరిశీలించి యుఎనిమిది మీటర్ల పొడవు మాత్రమే ఉండే పాత ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో 11 మీటర్ల కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో భూమిలో ఉన్న వాటర్ పైపు లైను దెబ్బ తినడంతో వాటిని పరిశీలించారు. ఆయన తో పాటు చాగలమర్రి ఎలక్ట్రికల్ ఏఈ రమణయ్య చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ ఈవో సబియా టిడిపి నాయకులు అన్సర్ బాషా, సల్లా నాగరాజు, బషీర్, కసినేని ఓబులేసు, గుత్తి నరసింహుడు, వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, రాజేష్, టైలర్ భాష, మోహన్ కృష్ణ, విద్యుత్ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు. చాగలమర్రి ప్రజలకు ఎప్పటినుండో ఉన్న ఈ సమస్యను తీరుస్తున్నందుకు చాగలమర్రి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఎన్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం





**ప్యాపిలి న్యూస్ నేడు:** ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్యాపిలిలో ఎన్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ గురువు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాకుండా, విద్యార్థుల జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి అని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ ఉపాధ్యాయులను గౌరవించి, వారి సూచనలను పాటించడమే నిజమైన గురుదక్షిణ అని పేర్కొన్నారు.కళాశాలలో ప్రతి సంవత్సరం ఒక అధ్యాపకుడిని సన్మానించే ఆనవాయితీలో భాగంగా ఈ ఏడాది వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు వెంకటరమణను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఎన్ ఎస్ఎస్ పిఓ నవీనపాటి, అధ్యాపకులు ముస్తాక్, శంకరయ్య, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, మురళీమోహన్ గౌడ్, ఓబులేసు, వన్నూర్ తదితరులతో పాటు ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## శ్రీసరస్వతీ శిశు మందిరంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**ప్యాపిలి న్యూస్ నేడు:** ప్యాపిలి పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిరంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి బీసీ విజయ్‌కుమార్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ రాధాకృష్ణన్ గొప్ప విద్యావేత్త, పండితుడు, ఉపాధ్యాయుడు, ప్రొఫెసర్‌గా సేవలందించడంతో పాటు ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతిగా దేశానికి సేవ చేశారని తెలిపారు. అనంతరం వాసు, జయంతి లక్ష్మిలను సన్మానించారు.విద్యార్థులు ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి గురువుల పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు. జాహ్నవి అనే విద్యార్థిని ఉపాధ్యాయురాలిగా నాలుగో తరగతి విద్యార్థులకు పాఠం బోధించగా, ఇతర విద్యార్థులు కూడా ఆచార్యులుగా మారి పాఠాలు బోధించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఆచార్య బృందం, బాలబాలికలు పాల్గొన్నారు.



## గురువును గౌరవంగా సత్కరించిన శిష్యులు



న్యూస్ నేడు, పత్తికొండ: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని పాఠాలు చెప్పి, విద్యాబుద్ధులు నేర్పిన తమ గురువును శిష్యులు గౌరవంగా సత్కరించారు. స్థానిక శాంతి టాలెంట్ హై స్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఎస్టియు రాష్ట్ర పూర్వ నాయకులు,సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కొత్తపల్లె సత్యనారాయణను వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయనీలు తన దగ్గర చదువుకున్న శిష్యులు ఆహ్వానించి పూలమాలలో దుశాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శ్రీదేవి, పాఠశాల ఉపాధ్యాయ బృందం , మగ్నోపేట బాయ్స్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, ఎస్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ వారి ఉపాధ్యాయ బృందం , ఏపీ ఎన్జీవో నాయకులు సాయిబాబా, రమేషు మొదలగు వారు, శాంతి టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయ బృందం శాలు వాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సత్యనారాయణ పత్తికొండ నియోజకవర్గం లో అనేకమంది విద్యార్థినీ విద్యార్థులను ఎన్నో విద్యా విలువలను నేర్పించిన ఖ్యాతి, ఘనత సత్యనారాయణ కే దక్కుతుందని వారన్నారు. అంకితభావంతో ఆదర్శవంతంగా ఉపాధ్యాయ వృత్తికి కట్టుబడి ఆ వృత్తికి న్యాయం చేసినటువంటి ఉపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ స్పందిస్తూ మీ అందరి ప్రేమాభిమానాలు ఎల్లవేళలా నాకు ఇలాగే ఉండాలని వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.

# విద్యార్థులు భవిష్యత్తును బంగారు బాటలుగా తీర్చిదిద్దుతున్న గురువులు దైవంతో సమానం

- సమాజ ప్రగతికి బాటలు వేస్తున్న ఉపాధ్యాయులు సేవలు చిరస్మరణీయం, అభినందనీయం
- భారతరత్న భారత మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా వారికి ఘననివాళులు
- ఉపాధ్యాయులందరికీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి
- జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చం



**ఏలూరుజిల్లా ప్రతినిధి,న్యూస్ నేడు:** జిల్లా పరిషత్తు సమావేశం మందిరంలో శనివారం భారతరత్న భారత మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)లు పూలదండలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రార్థన గీతాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 33 మంది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు, శాలువాలు, పండ్లను ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును బంగారుబాటలుగా తీర్చిదిద్దుతున్న గురువులు దైవంతో సమానం అని, గురుపూజా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు ఎంతో పవిత్రమైన దినం అని, ఆదర్శ గురువులు భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయులు అన్నారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా, ఉపరాష్ట్రపతిగా అనంతరం రాష్ట్రపతిగా పనిచేసి విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మహనీయులు ఈ రోజు పుట్టినరోజుని మనందరం ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థులు జ్ఞానాన్ని అందించి సంఘంలో ఒక గౌరవనీయ వ్యక్తిగా తీర్చిదిద్దడంలో గురువులు పాత్ర అపారమైనదని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు విద్యతో పాటు విలువలు నేర్పించడం చాలా అవసరమని అన్నారు.ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య( చంటి) మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులు తర్వాత మనల్ని సరైన మార్గంలో నడిపించేది గురువు ఒక్కరేనని అన్నారు. ఆ గురువుకి మనమందరం కూడా శిరస్సు వంచి నమస్కరించాలని అన్నారు. గురువు అంటే దైవంతో సమానం అని, విద్యార్థికి సరైన నడకని బాటని వేసి మంచి సంస్కృతి సంప్రదాయాలను అలవర్చి ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దే గురువు పాత్ర చాలా అమోఘమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, పరీక్షలు నిర్వహణ సహాయ కమీషనరు ఆర్.ఆశ, ఉప విద్యాశాఖ అధికారులు డా.పి. యస్.సుధాకర్, యన్.రవీంద్ర భారతి, జిల్లా పరిషత్తు, విద్యాశాఖ అధికారులు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అధిక సంఖ్యలో శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

- వివిధ సేవల రూపేణా రూ.1,94,250/- లు సమకూరినది
- కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి.చందన
- సుమారు 1850 మంది భక్తులకు నిత్యాన్నదాన సత్రం నందు అన్నదానం



**ఏలూరుజిల్లా ప్రతినిధి,న్యూస్ నేడు:** శనివారం సందర్భముగా ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలము , గురవాయిగూడెం గ్రామము నందు తెల్ల మద్ది చెట్టు క్రింద స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానము నందు ఉదయం గం.08.00లకు ఆలయ ముఖ మండపం నందు పంచామృత అభిషేకం ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆధ్వర్యములో జరుపబడినది. ఈ కార్యక్రమం నందు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ రోజు మద్యాహ్నం గం.03.00 ని లవరకు శ్రీ స్వామి వారి ఆలయమునకు వివిధ సేవల రూపేణా రూ.1,94,250/- లు సమకూరినది. ఈ రోజు మద్యాహ్నం గం.3-00 వరకు విచ్చేసిన సుమారు 1850 మంది భక్తులకు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన సత్రం నందు అన్నదానము జరుపబడినది. శ్రీ స్వామి వారి దేవస్థానం గర్భాలయం నందు గల తెల్ల మద్ది చెట్టును సంరక్షించుట నిమిత్తం ఆలయ అసిస్టెంట్ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారిణి వారు వెంకటరామన్నగూడెం నందు గల వైస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ వారిని కలిసి నివేధిక సమర్పించడమైనది. శ్రీ స్వామి వారి దేవస్థానంకు విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మ కర్తల మండలి అధ్యక్షులు రాజాన సత్యనారాయణ మరియు ఆలయ అసిస్టెంట్ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి.చందన తెలిపారు.

## హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

**వన్ డిస్ట్రిక్ట్-వన్ యాక్టివిటీ పేరుతో జిల్లా అన్ని క్లబ్బులు కార్యక్రమాలు**



**ఏలూరుజిల్లా ప్రతినిధి,న్యూస్ నేడు:** ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం లయన్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గా ఎంపిక కాబోతున్న లయన్ వి.విజయకుమార్ రాజు పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం, ప్రభుత్వ పాఠశాలల్లో,హాస్టల్స్ లో పోషకాహార పంపిణీ కార్యక్రమాలు,శనివారం ఉదయం క్లబ్ నందు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జిల్లా గవర్నర్ డా. డి.సుబ్బారావు,డా.సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. లయన్స్ జిల్లా గవర్నర్ సుబ్బారావు మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ పిలుపుమేరకు పర్యావరణ పరిరక్షణ, చిన్నారులకు పౌష్టికాహారం అందచేయాలనే ఉద్దేశంతో జిల్లాలోని క్లబ్బులు అన్ని "వన్ డిస్ట్రిక్ట్ -- వన్ యాక్టివిటీ" పేరుతో జిల్లా అన్ని క్లబ్బులు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్.సి.ఆర్.ఆర్. పి.జి. కళాశాల డైరెక్టర్ డా: యాలమర్తి బాబు,లయన్స్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ,విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ లేళ్ల వెంకటేశ్వరరావులను క్లబ్బు తరపున ఘనంగా సత్కరించారు.క్లబ్ అధ్యక్షులు కూరపాటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రీహరికోటి,ట్రెజరర్ నారాయణ, పూర్వపు జిల్లా గవర్నర్ వి.మురళీమోహనరావు, రీజియన్ చైర్మన్ శాఖమూడి మురళి కృష్ణ,జోన్ చైర్మన్ దాసరి గణేష్ బాబు,జిల్లా లయన్స్ నాయకులు కుర్మా శ్రీనివాస్, నాట్యాచార్య దువ్వి హేమసుందర్,వై.సత్యనారాయణ,ఇతర జిల్లా మరియు క్లబ్బు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

---------

## ఘనంగా జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం..

**సర్వేపల్లె రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అంగన్వాడి టీచర్ చంద్రకళ**



**చాగలమర్రి సెప్టెంబర్ 5 ( న్యూస్ నేడు) :** మండల కేంద్రమైన చాగలమర్రిలోని 17వ అంగన్వాడి కేంద్రంలో శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అంగన్వాడి టీచర్ చంద్రకళ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించిన రాధాకృష్ణన్ సేవలు మరువలేను అని ఆమె అన్నారు. జ్ఞానం అనే దివ్య ను వెలిగించి, అజ్ఞానం అనే చీకట్లను పారద్రోలే అక్షరమూర్తులు ఉపాధ్యాయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల తల్లులు పలువురు పాల్గొన్నారు.

## 4 రాష్ట్రాల్లో జనగణన

**ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్5 చట్టం న్యూస్, :** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముందుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1న జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ

జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (=+× – రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.




## ఏలూరు పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**ముఖ్యఅతిథిగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి**



ఏలూరుజిల్లా ప్రతి నిధి,న్యూస్ నేడు: గురుపూజోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి హాజరయ్యారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే బడేటి చంటికి ఏలూరు పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సోము సుధాకర్ పూలబొకేతో ఘన స్వాగతం పలికారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందిని ఎమ్మెల్యే బడేటి చంటి శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారిని అభినందించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బడేటి చంటిని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కలమందలపాడు పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం




**మిడుతూరు (నందికొట్కూరు)న్యూస్ నేడు:** నంద్యాల జిల్లా మిడుతూరు మండలంలోని ఎంపీపీ మరియు జిల్లా పరిషత్ పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కలమందలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి-2 మల్లికార్జున నాయక్ హాజరయ్యారు.మార్చి నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఈ పాఠశాలలో చదివిన విద్యార్థి మండలంలోననే మొదటి స్థానంలో నిలిచి ట్రిబుల్ ఐటీ సీట్ సాధించారంటే ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని పాఠశాల కమిటీ సభ్యులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.తర్వాత ఎస్ఎంసీ కమిటీ సభ్యులు మరియు విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పించారు.ఉపాధ్యాయులు చెప్పిన విధంగా నడుచుకుంటూ మంచిగా చదివితే మీరు అనుకున్న లక్ష్యాలను చేదిస్తారని అంతే కాకుండా పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు వస్తారని ఎంఈఓ విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా వివిధ పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరిస్తూ కేక్ కట్ చేస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.పాఠశాలల్లో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## నూతన వాటర్ బ్రౌజర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

- ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి
- రూ.80 లక్షలతో వాటర్ బ్రౌజర్ ప్రారంభం
- ఏలూరుకు మరో ఫైర్ ఫైటర్

**ఏలూరు జిల్లా ప్రతినిధి,న్యూస్ నేడు:** అత్యవసర సమయాల్లో ప్రజలకు సత్వర అగ్నిమాపక సేవలు అందించేందుకు అవసరమైన వనరులను మరింత బలోపేతం



చేస్తున్నామని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.80 లక్షలతో కొనుగోలు చేసిన నూతన వాటర్ బ్రౌజర్‌ను శుక్రవారం ఏలూరు అగ్నిమాపక కేంద్రంలో ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవస్థలను బలోపేతం చేస్తూ, మంజూరైన నిధులను నిర్దేశిత పనులకే వినియోగిస్తూ పారదర్శకంగా ముందుకు సాగుతోందన్నారు. జిల్లాలో ఆరు అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయని, ఏలూరు కేంద్రంలో ఇప్పటికే రెండు వాహనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తాజాగా మరో వాహనం అందుబాటులోకి రావడంతో అత్యవసర సేవల్లో అంతరాయాలు తగ్గి, ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించే అవకాశం ఏర్పడిందన్నారు.

- జీవిత పాఠాలతో స్థిరపడతారు..
- క్రమశిక్షణతో కూడిన విద్య తోనే... భవిష్యత్ బంగారం..
- ఎస్ ఆర్ కాలేజీ జోనల్ ఇంచార్జ్ రఘువీర్
- ఘనంగా ఫ్రెషర్స్ డే , ఉపాధ్యాయ దినోత్సవం

# లక్ష్యంతో చదవండి...







**కర్నూలు ఎడ్యుకేషన్, న్యూస్ నేడు :** క్రమశిక్షణతో కూడిన విద్యుత్ తోనే భవిష్యత్తు బంగారం అవుతుందని లక్ష్యంతో చదివితే జీవితంలో స్థిరపడతారని ఎస్ఆర్ కాలేజీ జోనల్ ఇంచార్జ్ రఘువీర్ అన్నారు. శనివారం నగరంలోని కెవిఆర్ గార్డెన్స్ లో 2026 సంవత్సర విద్యార్థుల ఫ్రెషర్స్ డే మరియు ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్ రఘువీర్ మాట్లాడుతూ పట్టుదల కృషి ఏకాగ్రతతో లక్ష్యసాధనకు అడుగులు వేయాలని క్రమశిక్షణతో కూడిన విద్య అందించడం ఎస్ ఆర్ కళాశాల ప్రత్యేకత అని పేర్కొన్నారు.

అనంతరం విద్యార్థులు ఎస్సార్ కళాశాల జోనలించారు రఘువీర్ తో పాటు దీన్. కిరణ్ కుమార్, ప్రిన్సిఫల్ రవీంద్ర గౌడ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలాగే ప్రతిభ కలిగిన 2026 విద్యార్థిని విద్యార్థులు బైపిసి విభాగంలో 440/450 గాను. పీ.జ లో 465/470 భవ్యశ్రీ, రేవంత్ సాయి తమ ప్రతిభ చాటిన వారిని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఆటల్లో ప్రతిభ కనభరిచిన మానిక, త్రివేణి లను సన్మానించారు. అటు తరువాత విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరారించారు, ఇందులో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గోన్నారు.

# చర్చలు సఫలం..

-- ఏపీ జెఏసీ ఆధ్వర్యంలో థాంక్యు సీఎం సార్




**కర్నూలు , న్యూస్ నేడు :** ఉద్యోగ ,ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక డిమాండ్ల బకాయిల విషయంలో ముఖ్యమంత్రి తో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మరియు ఏపీ జేఏసీ చైర్మన్ కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్ తో జరిగిన చర్చలు సఫలం కావడంతో

కర్నూలు జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో థ్యాంక్యూ సీఎం సార్ అనే నినాదంతో కర్నూల్ కలెక్టర్ కాంప్లెక్స్ ఆవరణము నందు బానసంచా పేల్చి ఉద్యోగులు సంబరాలు చేశారు.

PRC ఏర్పాటు కు వెంటనే ఉత్తర్వులు,

పెండింగ్లో ఉన్న నాలుగు డీ ఏ లలో అక్టోబర్ 1 తేదీ నుంచి 2 డి ఏ లు విడుదలబ్, పెండింగ్ లో ఉన్న నాలుగు సరెండర్ లీవ్లలో ఒక సరెండర్ లీవ్ జనవరి నుంచి విడుదలకు అంగీకారం,

పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం పెన్షన్ 12 సంవత్సరాలు నుంచి 15 సంవత్సరాలకు పెంపుదలకు అంగీకారం,

IR పై కూడా త్వరలో చర్చించి విడుదలకు హామీ ఇవ్వడం, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం సంబంధించి ఇక మీదట డైరెక్ట్ గా ఎన్టీఆర్ ట్రస్టుకే ఉద్యోగుల డబ్బు, జమ అయేటట్టు ఉత్తర్వులు విడుదలకు సీఎం చంద్రబాబు నాయుడు అంగీకారం తెలిపినట్లు ఏపీ జేఏసీ కర్నూల్ నాయకులు తెలిపారు.

కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జవహర్లాల్ , ప్రధాన కార్యదర్శి ఎం సి కాశన్న, కోడుమూరు అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసుయాదవ్, చంద్రశేఖర్, కర్నూల్ నగర అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ ,సాయిరాం, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమోహన్, సాంబశివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి కెసిహెచ్ కృష్ణుడు, =ఎ రమణ, నాగ కిషోర్, సుధాకర్, జిల్లాకోశాధికారి భాస్కర్ నాయుడు,

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు,ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, కర్నూల్ నగర యూనిట్ కార్యవర్గము, వెంకటేశ్వర్లు,చలపతి, లక్ష్మీ నరసయ్య, నాగరాజు, మద్దయ్య, షణ్ముఖ రాజ, శ్రీరాములు, ఈ సందర్భంగా ఇతర డిపార్ట్మెంటు నాయకులు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# రవీంద్ర పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**కర్నూలు ఎడ్యుకేషన్, న్యూస్ నేడు :** అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, వైభవంగా నిర్వహించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, మహోన్నత తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ శ్రీ జి. పుల్లయ్య, అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్, వైస్ చైర్మన్ శ్రీ జి. వంశీధర్ గారు హాజరై ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జి. పుల్లయ్య మాట్లాడుతూ,"అక్షరాన్ని ఆయుధంగా మార్చి, విద్యార్థి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే మహనీయుడు ఉపాధ్యాయుడు"...విద్యార్థుల జీవితాలను సరైన దిశలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయ వృత్తి యొక్క అసలైన లక్ష్యమని అన్నారు. అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్ మాట్లాడుతూ, మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. "ఉపాధ్యాయుడి మాట విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేస్తుంది; ఉపాధ్యాయుడి ప్రవర్తన విద్యార్థికి ఆదర్శంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ జి. వంశీధర్ మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని, విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల అంకితభావం, కృషి, సహనం దాగి ఉంటాయని కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలోని ఉపాధ్యాయులు బి. చంద్రశేఖర్, శ్రీమతి శివపార్వతి,కె. శ్రీరాములు లను ఘనంగా సత్కరించి, వారి సేవలను యాజమాన్యం అభినందించింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రసంగాలు ప్రత్యేక కార్యక్రమాలు అంతరిని ఆకట్టుకున్నాయి పాఠశాల ఆవరణ అంతా గురుభక్తి ఆనందోత్సాహాలతో నిండిపోయింది ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ' నైరా' కలెక్షన్ విడుదల చేసిన ' మలబార్ '

### శ్రీ నిధి నటించిన సరికొత్త ప్రచార చిత్రం విడుదల




**కర్నూలు, న్యూస్ నేడు :** ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆభరణాల రిటైలర్ గా, 'ది రెస్పాన్సిబుల్ జ్యువెలర్' గా గుర్తింపు పొందిన మల మలబార్ గోల్డ్ ఢ డైమండ్స్, ప్రకృతిలోని అత్యంత సహజసిద్ధమైన రత్నాలను తరతరాలు మెచ్చే ఆభరణాలుగా మలిచి 'నైరా' పేరిట తమ కొత్త సహజ రత్నాల ఆభరణాల కలెక్షన్ ను విడుదల చేసింది. ప్రముఖ నటి, మోడల్ శ్రీనిధి శెట్టి ఈ కలెక్షన్ కు ముఖచిత్రంగా వ్యవహరించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాలలో నిర్వహిస్తోన్న ఈ బ్రాండ్ యొక్క 'జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్'కి ఈ ఆవిష్కరణ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఈ ఉత్సవంలో భాగంగా వినియోగదారులు రత్నాలు మరియు అన్ కట్ ఆభరణాల తరుగు ఛార్జీలపై 25% వరకు తగ్గింపును పొందవచ్చు. ఈ ఆఫర్ 14 సెప్టెంబర్ 2026 వరకు అందుబాటులో ఉంటుంది.

ప్రకృతి ప్రసాదించిన అరుదైన సంపదల శాశ్వత సౌందర్యం నుంచి స్ఫూర్తి పొందిన 'నైరా', సంప్రదాయ చిల్లె, పచ్చి ఆభరణాల తయారీ కళలోని నైపుణ్యాన్ని ఆధునిక రూపంలో ఆవి ష్కరిస్తోంది. బంగారంతో రూపొందించి, విలువైన సహజ రత్నాలతో పొదిగిన ఈ కలెక్షన్, శిల్ప రూపాలను మరియు క్లిష్టమైన అంశాలను ఒకచోట చేర్చి సాంప్రదాయ రత్నాల ఆభరణాలకు ఒక సరికొత్త రూపాన్ని అందిస్తుంది. కొత్త తరం వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రూపుదిద్దుకున్న 'నైరా', సహజ రత్నాలతో రూపొందించిన ఆభరణాలను సరికొత్త డిజైన్ శైలిలో పరిచయం చేస్తోంది. ఈ కలెక్షన్లో ని అద్భుతమైన పనితనం, రత్నాల ప్రత్యేకత, విలక్షణమైన సౌందర్యాన్ని ప్రధానంగా ఆవిష్కరిస్తోంది. సాంప్రదాయ ఆభరణాల తయారీ నైపుణ్యాన్ని, అభివృద్ధి చెందుతున్న డిజైన్ అభిరుచులను, వినియోగదారుల ప్రాధాన్యతలను మేళవించడంపై మలబార్ గోల్డ్ ఢ డైమండ్స్ యొక్క దృష్టిని ఈ కలెక్షన్ ప్రతిబింబిస్తుంది.

ొత్తగా విడుదల చేసిన నైరా కలెక్షన్తో పాటు, జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ కోసం మలబార్ గోల్డ్ ఢ డైమండ్స్ వారిచే ప్రత్యేకంగా ఎంపిక చేయబడిన రత్నాలు మరియు "అన్ కట్ ఆభరణాల శ్రేణి ద్వారా సహజ రత్నాలను ప్రదర్శిస్తుంది. దీనికి తోడు, ఈ ఫెస్టివల్లో వినియోగదారులకు అనుకూలమైన కొనుగోలు అనుభవాలను కల్పిస్తూ, సహజ రత్నాల ఆభరణాల ప్రపంచాన్ని మరింతగా తెలుసుకునే, పరిశీలించే అవకాశాన్ని కల్పిస్తోంది.

నైరా కలెక్షన్ ఆవిష్కరణ తో పాటుగా జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ ప్రారంభంపై మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం. పి. అహ్మద్ మాట్లాడుతూ "రత్నాల ఆభరణాలు ప్రకృతి సౌందర్యాన్ని, హస్తకళా నైపుణ్యాన్ని మరియు ప్రతి కస్టమర్ యొక్క వ్యక్తిత్వాన్ని ఒకచోట చేర్చుతాయి.

# అంగన్వాడి ఆయా నియామకానికి దరఖాస్తు చేసుకోండి.. సిడిపిఓ

**చాగలమర్రి సెప్టెంబర్ 5( న్యూస్ నేడు ) :** ఆళ్లగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని చాగలమర్రి మండలంలో అంగన్వాడి ఆయాల నియామకానికి మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తు కోరుచున్నట్లు ఐ సి డి ఎస్ సి డి పి ఓ శనివారం తెలిపారు. చిన్న బోధనంలో బీసీసీ అభ్యర్థులు, ముత్యాలపాడు నాలుగో సెంటర్ కు జనరల్, కేటగిరి అభ్యర్థులు, చింతలచెరువు ఒకటో సెంటర్ కు జనరల్, చాగలమర్రి 17వ సెంటర్ కు బి సి డి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు అలాగే నియోజకవర్గంలోని చాకరాజు వేముల, అర్జునపురం,వీరారెడ్డి పల్లె, గోవింద పల్లె, వెలుగల పల్లె, దాసర పల్లె,ముత్తలూరు, దొర్నిపాడు గ్రామాలలో అర్హత కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై , 25 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన మహిళలు స్థానికురాలుగా ఉండి వివాహితురాలు గా ఉండాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రం ఎస్ఎస్సి మార్కు లిస్టు తీసి నివాసస్థల దృపత్రం తప్పక కలిగి ఉండాలన్నారు, వితంతువులైతే భర్త చనిపోయిన మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. వికలాంగులు అయితే వికలాంగ ధ్రువీకరణ పత్రం దరఖాస్తుతో జతపరచాలన్నారు. ఆధార్ కార్డు రేషన్ కార్డు దరఖాస్తు వెంట అవసరమాకు దుర్వి పత్రాలు జిరాక్స్ కాపీలు సెల్ఫ్ అటాస్టేట్ కాపీలు ఉండవలెనని తెలిపారు. దరఖాస్తులను సిడిపిఓ కార్యాలయం 5వ తేదీ సెప్టెంబర్ 2026 ఉదయం 10:30 నిమిషాల నుండి 18.9.2026 సాయంత్రం ఐదు గంటల లోపు కార్యాలయ పనివేళలో సమర్పించాలన్నారు.

# మంత్రాలయంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



**మంత్రాలయం న్యూస్ నేడు :** - నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు యాదవుల సంఘం సభ్యుల అధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర స్వామి మఠం నుండి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా కొండాపురం ఆంజనేయస్వామి వరకు ఊరేగింపుగా వెళ్లి ఆంజనేయస్వామి దేవాలయంలో కృష్ణునికి ప్రత్యేక పూజలు,పంచామృత అభిషేకంనిర్వహించారు.

అనంతరం ఊరేగింపుగా రథం మీద కృష్ణుని విగ్రహాన్ని ఉంచి రాఘవేంద్ర సర్కిల్ నుంచి రాఘవేంద్ర స్వామి గుడి వరకు రథం మీద ఊరేగించారు. తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్,బద్రి,సూరి, కాంట్రాక్టర్ శివ, నాగేష్,వెంకటేష్, కృష్ణమూర్తి,గురు, భీమేష్,అంజి,రవి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మఠంలో శ్రీ కృష్ణ వేషధారణ పోటీలు





**మంత్రాలయం న్యూస్ నేడు :** - ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం లో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఊంజల మండపంలో శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ వేషధారణ పోటీలు గాన పోటీని శనివారం నిర్వహించారు. శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలో చిన్నారులు ఆనందంగా పాల్గొని కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఒక ప్రత్యేకమైన శోభను, ఆనందాన్ని జోడించడం ఈ వేడుకలకే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అందమైన వేషధారణలు మరియు ఉత్సాహభరితమైన ప్రదర్శనలు ఉన్న ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో పీఠాధిపతులు శ్రీ సుభుధేంద్ర తీర్థులు చిన్నారులకు అనుగ్రహ విజేతలకు మరియు పాల్గొన్నవారికి బహుమతుల పంపిణీ చేశారు.

# ఘనంగా వైష్ణవి స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు





**మంత్రాలయం న్యూస్ నేడు ;-** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో వైష్ణవి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో గురువారం కృష్ణాష్టమి వేడుకలు పాఠశాల ఏఓ రవి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో వేయించిన శ్రీ కృష్ణుడు , రాధా వేషధారణ ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థులతో ఊటికొట్టించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడారు శ్రీ కృష్ణుడు గొప్పతనం , శ్రీ కృష్ణ జన్మాష్టమి విశిష్టత గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయునీలు పాల్గొన్నారు.

# మంధానకు ఇంకెప్పుడు కెప్టెన్సీ ఇస్తారు?

## మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ డిమాండ్




మహిళల ఆసియా కప్‌లో హాంకాంగ్‌పై 124 పరుగులతో చెలరేగి అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా స్మృతి మంధాన నిలిచింది. ఈ రికార్డుల పర్వం వేళ భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైస్ కెప్టెన్‌గా ఉన్న 30 ఏళ్ల స్మృతి మంధానను తక్షణమే టెస్టులు, వన్డేలు, టీ20లు అనే తేడా లేకుండా మూడు ఫార్మాట్లలోనూ భారత జట్టుకు పూర్తిస్థాయి కెప్టెన్‌గా ప్రకటించాలని అమితా శర్మ నేతృత్వంలోని జాతీయ ఎంపిక కమిటీని కోరారు. ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌ను జట్టు నుంచి తొలగించాలని తాను అనడం లేదని, కానీ ఆమె వయసు ఇప్పటికే 37 ఏళ్లకు చేరిందని డయానా గుర్తు చేశారు. హర్మన్ నుంచి కెప్టెన్సీ ఒత్తిడిని తొలగిస్తే ఆమె స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసి మిడిల్ ఆర్డర్‌లో పరుగులు సాధించగలదని అభిప్రాయపడ్డారు. "మనం ప్రతిసారీ ఓపెనర్లపైనే ఆధారపడలేం కదా. మిడిల్ ఆర్డర్‌లో హర్మన్ ఫామ్ జట్టు విజయాలకు ఎంతో ముఖ్యం. అందుకే స్మృతికి కెప్టెన్సీ ఇచ్చి, హర్మన్‌ను సీనియర్ ప్లేయర్‌గా కొనసాగించాలి" అని డయానా విశ్లేషించారు. ప్రస్తుతం స్మృతి మంధాన మంచి ఫామ్‌తో పాటు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉందని, నాయకత్వ బాధ్యతలు చేపట్టడానికి ఇది సరైన సమయమని డయానా పేర్కొన్నారు. స్మృతి సుదీర్ఘకాలం కెప్టెన్‌గా ఉండే అవకాశం ఉంటుందని, ఆమెకు డిప్యూటీగా జెమీమా రోడ్రిగ్స్ లేదా షఫాలీ వర్మలను వైస్ కెప్టెన్లుగా నియమించి భవిష్యత్ సారథులుగా తీర్చిదిద్దవచ్చని సూచించారు. కనీసం పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనైనా స్మృతికి కెప్టెన్సీ ఇచ్చి, టెస్టుల్లో హర్మన్‌ను కొనసాగించినా పర్లేదని ఆమె అభిప్రాయపడ్డారు. కాగా, కెప్టెన్సీకి తాను సిద్ధంగానే ఉన్నానని స్మృతి ఇప్పటికే ప్రకటించడం గమనార్హం. మరోవైపు మిథాలీ రాజ్ ఆల్‌టైమ్ పరుగుల రికార్డును మంధాన అధిగమించడంపై మిథాలీ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "ఒక సాధారణ క్రీడాకారిణిగా కెరీర్ ప్రారంభించి అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా స్మృతి ఎదిగిన తీరును చూశా. నా రికార్డును దాటి అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన మహిళా క్రికెటర్‌గా ఆమె నిలవడం సంతోషంగా ఉంది" అని మిథాలీ పోస్ట్ చేశారు.

.............

# టీ20 క్రికెట్‌లో శ్రీ చరణి అరుదైన ఫీట్!

దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు తన జోరును కొనసాగిస్తోంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 137 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత క్రీడాకారిణులు అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా యువ బౌలర్, తెలుగు తేజం శ్రీ చరణి తన అద్భుతమైన బౌలింగ్‌తో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 193 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 194 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. ముఖ్యంగా శ్రీ చరణి తన స్పెల్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టింది. తన అద్భుతమైన బౌలింగ్‌తో హాంకాంగ్ పతనాన్ని శాసించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో కేవలం 3.2 ఓవర్లు బౌలింగ్ చేసిన శ్రీ చరణి, 16 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టింది. ఈ ప్రదర్శనతో ఆమె ఒకే క్యాలెండర్ ఇయర్‌లో భారత మహిళల జట్టు తరఫున అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. 2026 క్యాలెండర్ ఇయర్‌లో చరణి ఇప్పటివరకు మొత్తం 31 వికెట్లు పడగొట్టింది. ఈ




క్రమంలో 2024లో 30 వికెట్లు తీసిన దీప్తి శర్మ రికార్డును ఆమె అధిగమించింది. ప్రస్తుతం ఈ జాబితాలో స్పిన్నర్ పూనమ్ యాదవ్ అగ్రస్థానంలో ఉంది. ఆమె 2018లో 35 వికెట్లు తీసి ఈ రికార్డును నెలకొల్పింది. చరణి ప్రస్తుత ఫామ్ చూస్తుంటే, ఈ ఏడాది ముగిసేలోపు పూనమ్ యాదవ్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# భారత్‌--జపాన్ మధ్య చారిత్రాత్మక పోరు..




భారత్-జపాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని క్రికెట్ మైదానంలో ప్రత్యేక రీతిలో జరుపుకోనున్నారు. భారత పురుషుల క్రికెట్ జట్టు జపాన్‌తో ఓ టీ20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ఇటువంటి అంతర్జాతీయ మ్యాచ్‌లో ఈ రెండు జట్లు తలపడటం ఇదే మొదటిసారి కావడం ఈ మ్యాచ్‌ను చారిత్రాత్మకంగా నిలుపుతోంది. సుజుకి కప్ సెప్టెంబర్ 22, 2026న టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. జపాన్ క్రికెట్ అసోసియేషన్, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ ప్రత్యేక మ్యాచ్‌ను ప్రకటించాయి. భారత పురుషుల క్రికెట్ జట్టు ఈ నెలలో ఆసియా క్రీడల కోసం జపాన్‌కు వెళ్లనుంది, కానీ దానికి ముందు జరిగే ఈ మ్యాచ్ చాలా ప్రత్యేకమైనది. టీమిండియా జపాన్‌తో తొలిసారిగా అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ప్రపంచంలోని అత్యంత బలమైన క్రికెట్ జట్లలో ఒకటైన భారత్, జపాన్‌లో క్రికెట్‌కు కొత్త రూపునివ్వడంలో కీలక పాత్ర పోషించగలదు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ ఆ దేశంలో క్రికెట్‌ను అభివృద్ధి చేయడానికి, దాని ప్రాచుర్యాన్ని పెంచడానికి చాలా కాలంగా కృషి చేస్తోంది. అందువల్ల భారత జట్టుతో జరిగే మ్యాచ్ స్థానిక ఆటగాళ్లకు, క్రికెట్ అభిమానులకు ఓ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. భారత్, జపాన్ మధ్య జరిగే ఈ మ్యాచ్ 'స్పోర్ట్ 75' చొరవలో భాగంగా జరిగే తొలి ఈవెంట్. క్రీడల ద్వారా ఇరు దేశాల మధ్య ప్రజల సంబంధాలను, సహకారాన్ని ప్రోత్సహించడమే ఈ చొరవ లక్ష్యం. 2036 ఒలింపిక్, పారాలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలన్న భారత ఆకాంక్షను కూడా పరిగణనలోకి తీసుకుంటూ, క్రీడా రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు భారత్, జపాన్ అగ్ర నాయకత్వం మధ్య కుదిరిన ఒప్పందంలో ఈ చొరవ ఒక భాగం. ఈ మ్యాచ్ భారత క్రికెట్‌కు ఓ ముఖ్యమైన సందర్భమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అభివర్ణించారు. జపాన్‌లో భారత జట్టు పాల్గొనడం కొత్త ప్రేక్షకులను చేరుకోవడానికి ఓ అవకాశమని ఆయన అన్నారు. భారత్, జపాన్‌ల మధ్య ఉన్న చిరకాల స్నేహ సంబంధాలను ప్రస్తావిస్తూ, ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకల్లో క్రికెట్ పాల్గొనడం ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుందని సైకియా అన్నారు. క్రికెట్‌ను దాని సాంప్రదాయ ప్రాంతాలకు మించి తీసుకువెళ్లాల్సిన బాధ్యతను బీసీసీఐ అర్థం చేసుకుందని.. అక్కడ ఈ క్రీడను బలోపేతం చేయడానికి జపాన్ క్రికెట్ అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తుందని కూడా ఆయన పేర్కొన్నారు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) నవోకి మియాజీ.. భారత జట్టుకు జపాన్ ఆహ్వానం అందడాన్ని తమ సంస్థకు ఓ చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. ఆయన బీసీసీఐకి దాని మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, భారత క్రికెట్ అభిమానులు జపాన్‌కు తరలివస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మియాజీ స్థానిక జపనీయులకు కూడా ఈ మ్యాచ్‌ను వీక్షించి, తమ జట్టుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జపాన్ ఆటగాళ్లకు, భారత్ వంటి బలమైన జట్టుతో ఆడటం అంతర్జాతీయ స్థాయిలో తమను తాము పరీక్షించుకోవడానికి ఓ గొప్ప అవకాశం అవుతుంది మరోవైపు ఆసియా గేమ్స్ 2026 టోర్నీకి టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండనున్నాడు. ఈ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ టోర్నీలో భారత పురుషుల క్రికెట్ జట్టుకు బీసీసీఐ సీఓఈ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం ప్రకటించింది. జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌కు భారత బృందాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. మొత్తం 768 మంది సభ్యులతో కూడిన భారత బృందంలో 503 మంది క్రీడాకారులు, 246 మంది అధికారులు, సహాయక సిబ్బంది, 19 మంది కంటింజెంట్ సిబ్బంది ఉన్నారు. ఆసియా గేమ్స్ నుంచి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు విశ్రాంతి ఇచ్చారు. అప్‌కమింగ్ సిరీస్‌ల కోసం గంభీర్‌కు రెస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో భారత్ వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది. గంభీర్ గైర్హాజరీలో వీవీఎస్ లక్ష్మణ్ జట్టును పర్యవేక్షించనున్నాడు. గంభీర్ సపోర్ట్ టీమ్ కూడా ఈ ఆసియా గేమ్స్‌కు దూరంగా ఉండనుంది.వీవీఎస్ లక్ష్మణ్‌కు సునీల్ జోషి, హృషీకేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్ సపోర్ట్ స్టాఫ్‌గా వ్యవహరిస్తారు. మహిళల జట్టుకు అమోల్ ముజుందార్ హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లోనూ లక్ష్మణ్ భారత జట్టుకు కోచ్‌గా సేవలందించాడు. ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్ అనంతరం గంభీర్‌కు విశ్రాంతి ఇవ్వగా.. లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. ఆసియా గేమ్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్నాయి. చైనా వేదికగా 2022 హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో రెండు జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. అప్పుడు పురుషుల జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించగా.. మహిళల జట్టును హర్మన్‌ప్రీత్ కౌర్ నడిపించింది.

# మహిళల ఆసియాకప్‌లో భారత్ జోరు..

## హాంకాంగ్‌పై 137 పరుగుల తేడాతో విక్టరీ

మహిళల ఆసియాకప్ 2026లో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. గురువారం దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచులో హాంకాంగ్‌ను 137 పరుగుల తేడాతో చిత్తు చేసింది. భారత ఓపెనర్ స్మృతి మంధాన రికార్డు సెంచరీతో టీమిండియా ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 193/5 రన్స్ చేసింది. అనంతరం హాంకాంగ్‌ను 56 పరుగులకు ఆలౌట్ చేసింది. దీంతో గ్రూప్-ఏలో అగ్రస్థానంలో నిలిచింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు మంధాన, షఫాలీ వర్మ (28) శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు వేగంగా పరుగులు జోడించి జట్టుకు బలమైన పునాది వేశారు. 8 ఓవర్లలో 74 పరుగులు జోడించారు. షఫాలీ అవుటైన తర్వాత కూడా మంధాన తన దాడిని కొనసాగించింది. ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లతో మంధాన స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. హాంకాంగ్ బౌలర్లను ఊచకోత కోస్తూ.. ఆమె కేవలం 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 124 పరుగులు చేసింది. ఆరంభంలో కాస్త నిలకడగా ఆడినా, కుదురుకున్నాక హ్యాట్రిక్ సిక్సర్లు బాది స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. మంధాన రాణించినా మిగతా బ్యాటర్లు పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. ప్రతికా రావల్ (10), రిచా ఘోష్ (11), హర్మన్ ప్రీత్ కౌర్ (10) విఫలమయ్యారు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. 194 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టుకు భారత బౌలర్లు చుక్కలు చూపించారు. నందిని శర్మ ఆరంభంలోనే వికెట్ తీసి హాంకాంగ్ పతనాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, ప్రేమా రావత్, శ్రీ చరణిలు వరుస వికెట్లతో విరుచుకుపడటంతో హాంకాంగ్ కోలుకోలేకపోయింది. కేవలం 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు, చివరి ఆరు వికెట్లను కేవలం 18 బంతుల వ్యవధిలోనే కోల్పోయి 16.2 ఓవరలలో 56 పరుగులకే ఆలౌటైంది. భారత్ 137 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ అత్యుత్తమంగా రాణించి కేవలం 9 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టింది. ఆమెకు తోడుగా నందిని శర్మ (2/6), ప్రేమా రావత్ (2/12), శ్రీ చరణి (2/16) తలో రెండు వికెట్లు తీసి హాంకాంగ్ పతనాన్ని శాసించారు. ఈ విజయంతో భారత జట్టు గ్రూప్-ఏలో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ టోర్నీలో తమ తదుపరి మ్యాచులో భారత్.. సెప్టెంబర్ 5న పాకిస్థాన్‌తో తలపడనుంది.

......



ఆదివారం,
సెప్టెంబర్ 6 2026

న్యూస్ నేడు
newsnedu.com



# పనిపాటా లేనివాళ్లకే ఓటీటీలు..



సీనియర్ నటుడు శివాజీ పేరు ఇటీవలి కాలంలో వివాదాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. మనసులో ఉన్నది ఉన్నట్లు ముఖం మీద కొట్టినట్లు మాట్లాడటం శివాజీ స్టైల్. ఈ విషయంలో ఎవరు ఏమనుకున్నా ఆయన వెనక్కి తగ్గరు. ఆ ముక్కుసూటితనమే వివాదాలకు కారణమవుతోంది. గతేడాది చివరిలో దండోరా సినిమా ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణ గురించి శివాజీ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు తోడు ఏకంగా మహిళా కమీషన్ వరకు విషయం వెళ్లింది. ఆ తర్వాత ఈ వివాదం నెమ్మదిగా సద్దుమణిగింది. తాజాగా ఓటీటీలపై శివాజీ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ వివరాల్లోకి వెళితే.. భారతదేశాన్ని కరోనా మహమ్మారి కమ్మేసినప్పుడు అందుబాటులోకి వచ్చిన ఓటీటీలు దేశంలోని వినోద రంగంపై పెను ప్రభావాన్ని చూపించాయి. అప్పట్లో థియేటర్‌కు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు వినోదం కోసం ఓటీటీపైనే ఆధారపడ్డారు. ఆ తర్వాత లాక్‌డౌన్ ఎత్తివేసి థియేటర్లు తెరిచినా అటు వైపు వెళ్లడానికి ప్రేక్షకుడు అంతగా ఆసక్తి చూపించలేదు. పెరిగిన టికెట్ ధరలు, తినుబండారాల ధరలు సామాన్యుడికి వణుకు పుట్టించాయి. అంత ఖర్చుపెట్టి సినిమా థియేటర్‌కు వెళ్తే చెత్త కంటెంట్‌తో మేకర్స్ విసుగు తెప్పిస్తున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టే కంటే అతి తక్కువ ఖర్చుతో ఇంట్లోనే కుటుంబ సభ్యులంతా కలిసి చూసేలా ఓటీటీలు వినోదాన్ని అందిస్తుండటంతో ప్రేక్షకుడు ఇటువైపు మొగ్గుచూపుతున్నారు. ఒక్క భాషకు పరిమితం కాకుండా ప్రపంచం నలుమూలలకు చెందిన ఒరిజినల్ కంటెంట్‌ను ఆస్వాదించే అవకాశం కలిగింది. భారతదేశంలో ఓటీటీ మార్కెట్ గిరాకిని గుర్తించిన అనేక బడా కంపెనీలు ఇక్కడి సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఇతర ఒరిజినల్ కంటెంట్‌ను దక్కించుకుని ప్రేక్షకుడిని ఆకట్టుకుంటున్నాయి. నిర్మాతలకు ఓటీటీ రైట్స్ రూపంలో అదనపు లాభాలు రావడంతో వారు కూడా వీటిని ప్రోత్సహించారు. అయితే ఆ తర్వాత ఓటీటీ కంపెనీలు.. సినిమాలు ఎప్పుడు విడుదల చేయాలో డిసైడ్ చేసే స్థాయికి చేరుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మంచి సినిమాలు వస్తుండటంతో ఇప్పుడిప్పుడే ప్రేక్షకులు తిరిగి థియేటర్ బాట పడుతున్నారు. కాగా.. ఆనంద్ దేవరకొండ- వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కిన మూవీ ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ బ్యానర్‌పై సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు నిర్మిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా.. అజీమ్ మొహమ్మద్ సినిమాటోగ్రాఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఎపిక్ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషనల్ కార్యక్రమాలు వేగవంతం చేసింది. దీనిలో భాగంగా ఈ మూవీ టీమ్ ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాల్గొన్న నటుడు శివాజీ ఓటీటీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓటీటీలలో కూడా డబ్బులు బాగా పెంచారు, డబ్బులు కట్టాలి ఫ్రీగా ఇవ్వరు. ఓటీటీ అనేది బాగా ఫ్రీగా ఉన్నోళ్లకి, ఇంట్లో ఉండి ఏం పోతాంలే అనుకునే లేజీగా ఉన్నోళ్లకే. సినిమా అనేది ఒక అద్భుతం. అంత పెద్ద థియేటర్‌లో మనమంతా ఎవరం అనేది మరిచిపోయి ఒక సినిమాను 200, 300 మంది మధ్యలో కూర్చొని చూస్తుంటే ఆ మజా, కిక్. అంతేకానీ ఇంట్లో కూర్చొని నీకు అవసరమైనప్పుడు జోమోటా వాడొచ్చాడు, స్విగ్గీ వాడొచ్చాడని బయటికి వెళ్లి వస్తుంటారు. ఏది ఏమైనా థియేటర్ థియేటరే. ఏం చెప్పినా కూడా థియేటర్‌లో సినిమా చూస్తుంటే ఆ కిక్కే వేరు. ఆ రోజు భయపడ్డారు కానీ నేను నటించిన 90'స్ మూవీ థియేటర్‌లో రిలీజ్ చేసుంటే 100 కోట్ల రూపాయలు కలెక్ట్ చేసేది. అలాగే ఇప్పుడు ఈ సినిమా కూడా థియేటర్‌లో చూస్తుంటే యూత్ పిచ్చెక్కిపోతారు. వైష్ణవి క్యారెక్టర్‌కి చాలా బాగా కనెక్ట్ అవుతారు.. మా వాడి క్యారెక్టర్‌కి అయితే ప్రతివాడు వాడే అవుతాడు అని శివాజీ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరి దీనిపై సినీరంగం నుంచి ఎలాంటి రియాక్షన్స్ వస్తాయో చూడాలి.

# సౌందర్యను తలచుకుని అర్జున్ ఎమోషనల్




తనదైన నటన, యాక్షన్ సీక్వెన్స్‌లతో సౌత్ సినీ ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్నారు యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా . సుమారు మూడు దశాబ్దాలకు పైగా తెలుగు, తమిళంలో ఎన్నో చిత్రాల్లో నటించిన ఆయన ఎంతోమందిని తన అభిమానులుగా మార్చుకున్నారు. కేవలం యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్‌ని మెప్పించే సినిమాలు తీసి అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తూ వస్తున్నారు. ఇటీవలే 'బ్లాస్ట్'తో మన బాక్సాఫీస్ సత్తా తగ్గలేదని మరోసారి నిరూపించారు. అయితే ఈ ప్రయాణం వెనుక ఆయన పడిన ఎన్నో కష్టాలు, అవమానాలు దాగి ఉన్నాయి. కెరీర్ ఆరంభంలో ఎదురైన ఒడిదుడుకులు, అవకాశాల కోసం చేసిన పోరాటాలు తనను రాటుదేలేలా చేశాయని ఆయన తరచూ గుర్తుచేసుకుంటుంటారు. తాజాగా ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కెరీర్, పరిశ్రమలోని స్నేహితులు, తన జీవితంలో అత్యంత విషాదకర ఘటన గురించి వివరిస్తూ ఎమోషనల్ అయ్యారు.సినీ రంగంలో స్వార్థం లేని స్నేహితులు దొరకడం ఎంతో అరుదని పేర్కొన్న అర్జున్... జగపతిబాబుతో తనకు ఉన్న సన్నిహిత అనుబంధాన్ని ప్రస్తావించారు. అదే క్రమంలో దివంగత నటి సౌందర్య ని గుర్తుచేసుకుంటూ ఆయన కంటతడి పెట్టించే విషయాలను షేర్ చేసుకున్నారు. అందానికి అందం, అంతకుమించిన అద్భుతమైన సహజ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సౌందర్య.. తనకు కేవలం ఒక కో స్టార్ మాత్రమే కాదని, జీవితంలో లభించిన అత్యుత్తమ స్నేహితురాలని అర్జున్ కొనియాడారు. 'ఒకరిని కోల్పోతే కలిగే శూన్యం ఎంతటిదో, 'ఐ మిస్ యూ' అనే చిన్న మాటకు ఎంతటి బరువైన అర్థం ఉందో సౌందర్య మన మధ్య లేకపోవడంతోనే నాకు తెలిసింది' అంటూ ఆయన ఎమోషనల్ అయ్యారు. సౌందర్య భౌతికంగా దూరమైన తర్వాతే తన జీవితంలో ఆమె ఎంతటి స్థానాన్ని ఆక్రమించిందో మరింత లోతుగా అర్థమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్జున్, సౌందర్య కలిసి నటించిన సినిమాలు వెండితెరపై ప్రత్యేకమైన ముద్ర వేశాయి. ముఖ్యంగా 1998లో వచ్చిన కుటుంబ కథా చిత్రం 'శుభవార్త', 2001లో విడుదలైన భక్తిరస చిత్రం 'శ్రీ మంజునాథ'లో వీరిద్దరి మధ్య కుదిరిన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో మెప్పించింది. కేవలం షూటింగ్‌లకే పరిమితం కాకుండా, తెరవెనుక కూడా ఒక ఆప్తురాలిగా సౌందర్య నిలిచారని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండే సౌందర్య వ్యక్తిత్వం, సహజ సిద్ధమైన నటన, మనుషులతో ఆమె మమేకమయ్యే తీరు ఎప్పటికీ మరువలేనివని అర్జున్ ఎమోషనల్ అయ్యారు. ఎన్ని సంవత్సరాలు గడిచినా సౌందర్య జ్ఞాపకాలు, ఆమెతో ఉన్న పవిత్రమైన స్నేహం తన గుండెల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

# 'ఆపరేషన్ గంగా'గా మోహన్‌లాల్ L367.. ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్!

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, డైరెక్టర్ విష్ణు మోహన్ కాంబినేషన్‌లో తెరకెక్కబోతున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ ఎ367కి సంబంధించి అత్యంత ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాకు 'ఆపరేషన్ గంగా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో చిక్కుకున్న వేలాది మంది భారతీయులను సురక్షితంగా మాతృదేశానికి తీసుకురావడానికి భారత ప్రభుత్వం చేపట్టిన చారిత్రాత్మక 'ఆపరేషన్ గంగా' తరలింపు మిషన్ ఆధారంగా డైరెక్టర్ విష్ణు మోహన్ ఈ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ క్యూరియాసిటీని పెంచుతోంది.







### అంతర్జాతీయ ప్రదేశాల్లో 180 రోజుల షూటింగ్

ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే జార్జియాలో శరవేగంగా ప్రారంభం కాగా, త్వరలోనే మోహన్‌లాల్ కూడా ఈ షెడ్యూల్‌లో జాయిన్ కాబోతున్నారు. ఈ సినిమా కోసం మేకర్స్ సుమారు 180 రోజులకు పైగా భారీ కాల్ షీట్స్‌తో చిత్రీకరణ ప్లాన్ చేశారు. పోలాండ్, జార్జియా, కజకిస్తాన్ వంటి అంతర్జాతీయ ప్రదేశాలతో పాటు భారత్‌లోని ఢిల్లీ, డెహ్రాడూన్, కొచ్చిలలో ఈ గ్రాండ్ విజువల్ వండర్‌ను చిత్రీకరించనున్నారు.

### భారీ బడ్జెట్.. భారీ తారాగణం

ఈ చిత్రాన్ని శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత గోకులం గోపాలన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో మోహన్‌లాల్‌తో పాటు బాలీవుడ్ ప్రముఖ నటులు అర్జున్ రాంపాల్, ఆదిల్ హుస్సేన్, భాగ్యశ్రీ భోర్సే, తమిళ నటుడు పార్థిబన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

### టాప్ టెక్నీషియన్లతో యాక్షన్ విజువల్స్

ఈ సినిమాకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతాన్ని అందిస్తుండగా, అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఓ సే-యెంగ్ యాక్షన్ సీన్స్ డిజైన్ చేస్తున్నారు. అంతేకాకుండా, ఆర్మీకి సంబంధించిన సన్నివేశాలు అత్యంత సహజంగా ఉండటానికి స్క్వాడ్రన్ లీడర్ వెర్లిన్ పన్వార్‌ను మిలిటరీ అడ్వైజర్‌గా టీమ్‌లోకి తీసుకున్నట్లు సమాచారం.

# ఆనంద్ దేవరకొండ 'ఎపిక్' ఈవెంట్‌లో రష్మిక కామెంట్స్

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. 'ఛ90'ం' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. ఈ వేడుకకు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు.

ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ 'ఎపిక్' ట్రైలర్ తనకు చాలా బాగా నచ్చిందని చెప్పారు. ట్రైలర్ చూస్తుంటే ఒక మంచి రొమాంటిక్ కామెడీ సినిమాను థియేటర్లలో చూడబోతున్నామనే ఫీలింగ్ కలిగిందని వెల్లడించారు. కథలో కనిపించిన ఎంటర్‌టైన్మెంట్, రొమాన్స్ తనను ఎంతో ఆకట్టుకున్నాయని, తప్పకుండా థియేటర్‌కు వెళ్లి ఈ సినిమాను చూస్తానని ఆమె తెలిపారు.

### ఈవెంట్‌కి రావడంపై సరదా వ్యాఖ్యలు

ఈవెంట్‌కి తాను రావడం వెనుక ఉన్న విషయాన్ని రష్మిక సరదాగా గుర్తుచేసుకున్నారు. ఆనంద్ దేవరకొండ స్వయంగా తనకు మెసేజ్ చేసి ఈ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించినట్లు చెప్పారు. ప్రస్తుతం తాను హైదరాబాద్‌లోనే 'రణబలి' సినిమా షూటింగ్‌లో ఉన్నానని, అందుకే తప్పకుండా వస్తానని ఆనంద్‌కి చెప్పినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య ఉన్న ఫ్యామిలీ బాండింగ్ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### వైష్ణవి చైతన్య పాత్ర, డైరెక్టర్ ఆదిత్యపై కామెంట్స్



సినిమాలో హీరోయిన్ వైష్ణవి చైతన్య పాత్ర చాలా స్ట్రాంగ్‌గా ఉంటుందని, కథలో ఆమె క్యారెక్టర్‌కి మంచి ప్రాధాన్యత ఉందని రష్మిక ప్రశంసించారు. ఇక దర్శకుడు ఆదిత్య హాసన్ గురించి మాట్లాడుతూ.. ఆయన చూడటానికి చాలా షైగా కనిపిస్తారు కానీ, ట్రైలర్‌లోని రొమాంటిక్ సీన్స్ చూస్తే ఆ షైనెస్ ఎక్కడా కనిపించలేదంటూ సరదా కామెంట్స్ చేయడంతో వేడుకలో నవ్వులు పూశాయి.

సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై రూపొందిస్తున్నారు. హెషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, శివాజీ, వాసుకి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



Editor, Publisher Printer & Owner : MITIKELA URUKUNDU, PLOT NO.37, NEAR MS.9, RK VILLAS, PASUPULA ROAD, PASUPULA POST, KURNOOL, ANDHRA PRADESH - 518002.
Printed at : M K PUBLICATION AND OFFSET PRINTERS 86/297/5, MAHA LAKSHMI NAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518002., Regd: RNI No.APTEL/25/A0055